ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 7 డిసెంబరు 2024 | 7



దశాబ్దాల కల సాకారం

రామచంద్రపురంలో
జిల్లా అదనపు సెషన్స్ కోర్టు సిద్ధం
ఈనెల 10న ప్రారంభించనున్న
హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి -9లో



పల్లెలు..డిజిటల్!

ఇక పంచాయతీల్లో సేవలన్నీ ఆన్‌లైన్

ప్రపంచం అంతా మారిపోయింది.. డిజిటల్ వైపు పరుగులు పెడుతోంది.. ప్రస్తుతం రూపాయి చెల్లించాలన్నా ఆన్‌లైన్.. అయితే పంచాయతీల్లో మాత్రం ఇప్పటి కింకా పాత పద్ధతే. ఏ సేవ కావాలన్నా మాన్యువల్‌గా దరఖాస్తు చేయాల్సిందే.. వాళ్లూ అదే స్థాయిలో మాన్యువల్‌గా ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. ఈ విధానానికి స్వస్తి పలకాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1103 పంచాయతీలు ఉండగా అన్నింటా ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో ఇక ఏ సేవ అయినా ఆన్‌లైన్‌లోనే. దీంతో గ్రామీణ ప్రజల కష్టాలు తీరనున్నాయి.. ఈ సేవలు జనవరి నుంచి అమల్లోకి వస్తాయి.

కార్పొరేషన్(కాకినాడ)/మండపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఇకపై డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రజలకు వేగంగా, పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందనున్నాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు కావాలంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే చాలు రెండు, మూడు రోజుల్లోనే జారీ కానున్నాయి. ఆన్‌లైన్‌లోనే ఆస్తిపన్ను చెల్లించొచ్చు.. వ్యాపార లైసెన్సులు పొందొచ్చు..వీటికి సంబంధించి కార్యదర్శులకు డిజిటల్ కీ అందుబాటులోకి రానుంది.దీంతో ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా ఆన్‌లైన్‌క్లియర్‌గా ఉండనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 62 మండలాలు 1103 పంచాయతీలున్నాయి.అన్ని పంచాయతీల్లో కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. పంచాయతీలు జారీ చేసే వివిధ ధ్రువీకరణ పత్రాలకు నిరీక్షించాల్సిన అవసరంలేదు. సులభంగా సర్టిఫికెట్లు పొందేలా రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కొత్తవిధానానికి శ్రీకారం చుట్టింది. మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే వాటిని కార్యదర్శులు పరిశీలించి డిజిటల్ సంతకాలు చేస్తారు. అనంతరం మీసేవ నుంచి సర్టిఫికెట్లు తీసుకునేలా చర్యలు చేపట్టారు.

కొత్త విధానం ఇలా..

పంచాయతీల ద్వారా జనన,మరణ ధ్రువీకరణ పత్రాలను మాన్యువల్ పద్ధతిలోనే జారీ చేస్తున్నారు. కొత్త విధానంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే అందులో నమోదు చేసిన ఫోన్ నెంబర్‌కి దరఖాస్తు సంఖ్య మెసేజ్ రూపంలో వస్తుంది. పత్రం సిద్ధం కాగానే దరఖాస్తుదారుడి ఫోన్ నెంబర్‌కు మెసేజ్ రూపంలో సమాచారం అందుతుంది.కొత్త విధానం అమల్లోకి రావడంతో పంచాయతీలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. రెండు, మూడ్రోజుల వ్యవధిలో సర్టిఫికెట్లు పొందే అవకాశం ఉంటుంది.

ఎక్కడి నుంచైనా చెల్లింపులు..

ప్రపంచంలో ఎక్కడ, ఏమూల ఉన్నా మీ సొంత ఊళ్లోని మీ ఇంటికి ఏటా ఆస్తిపన్ను చెల్లించాలంటే ఇక పంచాయతీ వరకు వెళ్లనక్కర్లేదు. ఉన్నచోటు నుంచే నేరుగా ఆన్‌లైన్‌లో ఆస్తిపన్ను చెల్లించవచ్చు. జనవరి నుంచి స్వర్ణ పంచాయతీల్లో భాగంగా డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. వ్యాపార లైసెన్సులు, భవన నిర్మాణ అనుమతులు, వివాహ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఇలా పలు సేవలను ఆన్‌లైన్‌లోనే పొందవచ్చు. ఈమేరకు పంచాయతీల్లో పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్) పరికరాలు సిద్ధం చేస్తున్నారు. వీటితో డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా బకాయిలు చెల్లించచ్చు. మరికొన్ని చోట్ల క్యూఆర్ కోడ్ ద్వారా పన్ను బకాయిలు వసూళ్లకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల నుంచి వసూలు చేసిన మొత్తాలను ఆయా పంచాయతీల పీడీ ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

గత ప్రభుత్వం నిర్లక్ష్యం

ప్రజలకు సత్వరం సేవలందించే ఉద్దేశంతో 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం డిజిటల్ పంచాయతీలను అభివృద్ధి చేసి ఒక పోర్టల్ తీసుకొచ్చింది. దీని నిర్వహణను అప్పట్లో నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్ (ఎన్ఐ సీ)కి అప్పగించింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్ఐసీ నిధులు ఇవ్వకపోవడంతో పోర్టల్ నిర్వహణ మూలనపడింది. దీంతో ఐదేళ్లపాటు పంచాయతీల డిజిటలైజేషన్ మూలన పడింది. కూటమి ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ పోర్టల్ నిర్వహణను రాష్ట్ర ఆర్థిక నిర్వహణ, సేవల సంస్థకు అప్పగిస్తోంది.ఈ నేపథ్యంలో జనవరి నుంచి అమల్లోకి రానుంది. ఇక గ్రామీణ ప్రజల కష్టాలు తీరనున్నాయి.

- జనవరి నుంచి డిజిటలైజేషన్
- జిల్లాలో 1103 పంచాయతీలు
- స్వర్ణ పంచాయతీల్లో అమలు
- ప్రజలకు వేగంగా సేవలు
- ఆన్‌లైన్‌లోనే ధ్రువీకరణపత్రాలు
- ఎక్కడి నుంచైనా పన్నులు చెల్లింపు
- మారనున్న పంచాయతీ పాలన
- కార్యదర్శులకు డిజిటల్ కీ
- త్వరగా సర్టిఫికెట్ల జారీ

తొలి దశలో ముఖ్యమైన సేవలు

పంచాయతీల్లో తొలిదశలో ముఖ్యమైన సేవలు ఆన్‌లైన్‌లోనే అందించనున్నారు. ఆస్తి విలువ ధ్రువీకరణ పత్రాలు, వ్యాపార లైసెన్సులు జారీ అయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు నిరభ్యంతర ధ్రువీకరణపత్రాలు, భవన నిర్మాణాలకు అనుమతులు ఆన్‌లైన్‌లో అందించనున్నారు. పంచాయతీల్లో అందించే 80 సేవలను క్రమంగా స్వర్ణ పంచాయతీ పోర్టల్లో అందుబాటులో పెట్టనున్నారు. దీంతో గ్రామీణ ప్రజల కష్టాలు తీరనున్నాయి. ఇక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే చాలు 80 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయి.

కార్యదర్శుల వివరాలు సేకరణ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 62 మండలాలు 1103 పంచాయతీలున్నాయి. అన్ని పంచాయతీల్లో కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు.మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల డిజిటల్ సంతకాలను బయోమెట్రిక్‌తో నమోదు చేశారు. డిజిటల్ టోకెన్లను జారీ చేయడానికి కార్యదర్శుల డిజిటల్ సంతకాలు, వివరాలను కంప్యూటర్ ఆపరేటర్ సేకరించారు. ప్రతి కార్యదర్శికి సంబంధించి సమగ్ర వివరాలను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో పొందుపరుస్తున్నారు. ఇప్పటికే డిజిటల్ సంతకాల సేకరణ పూర్తి కాగా కార్యదర్శులకు డిజిటల్ కీలను జిల్లా ఉన్నత అధికారులు అందజేశారు.





సుబ్బారాయుడి షష్ఠి నేడే

ఏ వేమవరంలో షష్ఠి ఉత్సవాల వెలుగులు

జిల్లావ్యాప్తంగా సుబ్బారాయుడి షష్ఠి ఉత్సవాలకు ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. ముఖ్యంగా అమలాపురం మండలంలోని ఏ వేమవరంలో 42 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం వద్ద ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేశారు. అలాగే అమలాపురం, మాచవరం, కడలి, మురమళ్ల, ఉప్పలగుప్తం, ముక్తేశ్వరం, రావులపాలెం తదితర చోట్ల షష్ఠి వైభవంగా జరుగనుంది. - 10లో



రాయవరం హైస్కూల్‌లో పీటీఏం సమావేశం కరపత్రాలు చూపుతున్న విద్యార్థులు

నేడు మెగా పేరెంట్ టీచర్స్ మీట్

ఇప్పటికే తల్లిదండ్రులకు ఆహ్వానాలు.. జిల్లాలో 1582 పాఠశాలల్లో సమావేశాలు

రాయవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూలేని విధంగా విద్యా వ్యవస్థలో అతి పెద్ద పండుగను నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోను శనివారం తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం (పేరెంట్ టీచర్స్ మీటింగ్) ఏర్పాటుచేస్తున్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకోసం బడివైపు ఒక అడుగు పేరుతో ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రాలు అందజేయడంతోపాటు రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నవిద్యార్థుల ప్రగతి నివేదికలను హోలిస్టిక్ కార్డుల రూపంలో అందజేసేందుకు ఇప్పటికే ఉపాధ్యాయులు సిద్ధంచేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు గౌరవంగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కు ఆహ్వానం పలకాలని విద్యాశాఖ ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా ఇప్పటికే అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులకు విద్యార్థులచే ఆహ్వానపత్రాలు అందజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి భోజనాలు చేసేలా ఏర్పాట్లు చేసినట్టు రాయవరం మండల విద్యాశాఖ అధికారి-2 వై.సూర్యనారాయణ తెలిపారు. జిల్లాలో 1582 ప్రభుత్వ పాఠశాలల్లో పీటీఎంలకు ఏర్పాట్లు చేసినట్టు సమగ్ర శిక్ష ఏఎంవో పిల్లి రాంబాబు తెలిపారు. డీఈవో షేక్ సలీం బాషా ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి.



రోడ్లకు.. మహర్దశ!

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దృష్టి
- ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతులు
- రూ.127.48 కోట్లు మంజూరు
- 407 పనులకు టెండర్లు
- 377 పనులు ప్రారంభం
- కోడ్‌తో ఆగిన 30 పనులు
- 13, 16 తేదీల్లో రీటెండర్లు
- జనవరి నెలాఖరుకు గడువు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రహదారి మరమ్మతు పనులు ఉమ్మడి జిల్లాలో పూర్తిస్థాయిలో త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కొన్నిచోట్ల జాప్యం జరిగింది. కోడ్ ముగిసిన వెంటనే పెండింగ్‌లో ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులకు సంబంధించి టెండర్లను పిలవడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రధానంగా 30 ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతు పనులకు టెండర్లకు ఆహ్వానం పలకనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.127.48 కోట్లతో 407 పనులు చేయాలని ఎన్నికల కోడ్‌కు ముందు టెండర్లను ఆహ్వానించారు. కాంట్రాక్టర్ల నుంచి టెండర్లు రావడంతో 377 పనుల వరకు ఖరారు చేశారు. వీటిలో తొలి ఫేజ్‌లో 172 రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించారు. తర్వాత ఫేజ్‌లో మిగిలిన 205 పనులను మొదలుపెట్టారు. ఇటీవల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో 30 పనులకు సంబంధించి టెండర్లు ఖరారు కాలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ పనులకు ఈనెల 13,16వ తేదీల్లో టెండర్లకు ఆహ్వానం పలకాలని ఆర్అండ్‌బీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈనెల 12వ తేదీతో ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ముగియనుంది. దీంతో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం టెండర్లను పిలుస్తున్నారు. టెండర్లు పిలిచిన తర్వాత అగ్రిమెంట్లు చేసుకుని ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులను చేపట్టనున్నారు.

గత ప్రభుత్వంలో అధ్వానం..

గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క రోడ్డు మరమ్మతు పని కూడా చేయలేదు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్అండ్‌బీ రహదారులు అధ్వానంగా దర్శనమిచ్చాయి. ఉమ్మడి జిల్లా వాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం పడితే గుంతల రోడ్లపై ప్రయాణించలేక వాహనదారులు ప్రమాదాల బారినపడ్డారు. ఐదునెలల కిందట కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల దశ మారింది. రోడ్ల మరమ్మతులకు పెద్దఎత్తున నిధులు విడుదల చేశారు. దీంతో రోడ్లపై గతుకుల బాధ తప్పుతోంది. ఉమ్మడి జిల్లాలో కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంతో పాటు ఇతర పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు జరుగుతున్నాయి.

తుఫాన్ల వల్ల జాప్యం

గత రెండు నెలల్లో సంభవించిన తుఫాన్ల వల్ల మరమ్మతు పనులు చేయడానికి ఆటంకాలు ఏర్పడ్డాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడం వల్ల కొంతవరకు జాప్యం జరిగినట్టు అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతానికి వాతావరణం అనుకూలంగా ఉండడం వల్ల పనుల వేగం పెరుగుతుందని అందరూ భావిస్తున్నారు. ఈ విషయమై కాకినాడ సర్కిల్ ఆర్అండ్‌బీ ఎస్ఈ జి.కంతును 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా పెండింగ్‌లో ఉన్న పనులకు కోడ్ ముగిసిన వెంటనే టెండర్లు పిలుస్తున్నామన్నారు. వచ్చే ఏడాది జనవరి నెలాఖరుకల్లా మొత్తం మరమ్మతు పనులు పూర్తి చేసేలా కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఈ పనులు చేసేందుకు నిధులు సిద్ధంగా ఉన్నాయని, అడ్డంకులు ఎదురైనా వాటిని అధిగమించి నిర్దేశిత సమయానికి ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేస్తామని చెప్పారు.



కలెక్టరేట్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ప్రతీ పౌరునికి స్వేచ్ఛ.. సమానత్వం కల్పించిన అంబేడ్కర్ : కలెక్టర్

రాజ్యాంగ నిర్మాతకు వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

అమలాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతీ పౌరునికి స్వేచ్ఛా సమానత్వం కల్పిస్తూ రాజ్యాంగ చట్టాన్ని రూపొందించిన మహనీయునిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. కుల వివక్షత, అంటరానితనం వంటి వివక్ష పూరిత సమాజంలో పుట్టిన ధృవతారగా అంబేడ్కర్‌ను పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన కాంస్య విగ్రహానికి కలెక్టర్ పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ సభల రూపకల్పన, ప్రభుత్వ విధి విధానాలు, పీడిత ప్రజల ఆశయాలను ప్రతిబింబించేలా రాజ్యాంగాన్ని లిఖించారన్నారు. భారత రాజ్యాంగం దేశ ప్రజలకు కరదీపిక వంటిదన్నారు. భారత న్యాయవ్యవస్థ పాత్రను బలోపేతం చేసేందుకు ఆయన కృషి చేశారన్నారు. బోధించు, సమీకరించు, పోరాడు అనే నినాదంతో అందరినీ సంఘటితం చేశారన్నారు. బలహీనవర్గాల వారికి రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులు, రిజర్వేషన్లు కల్పించారన్నారు. దేశ పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగ రూపకల్పన చేసిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. భారత రాజ్యాంగ పితగా ఆయన కీర్తించబడుతున్నారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వి.మదన్మోహనరావు మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలిగా అంబేడ్కర్‌ను కీర్తించారు. అందుకే ఐక్యరాజ్య సమితి అంబేడ్కర్‌ను ప్రపంచ మేధావిగా గుర్తించిందన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీ రాణి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లాస్థాయి యువ ఉత్సవ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

12న జిల్లాస్థాయి యువ ఉత్సవ్

భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహణ

అమలాపురం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యువత తమ ప్రతిభను నిరూపించుకునేందుకు యువ ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఈనెల 12న భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో యువ ఉత్సవ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో యువ ఉత్సవ్ గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. జిల్లాలోని యువత ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నెహ్రూ యువకేంద్రం అధికారి దూలం కిశోర్ మాట్లాడుతూ ఇండియా-2047 అనే అంశంపై యువతకు వక్తృత్వం, చిత్రలేఖనం, కవిత్వం, మొబైల్ ఫొటోగ్రఫీ విభాగాల్లో వ్యక్తిగత పోటీలు నిర్వహిస్తామన్నారు. కల్చరల్ అండ్ ట్రెడిషనల్ విభాగంలో జానపద నృత్య పోటీలు, సైన్స్ ఎగ్జిబిషన్ మేళా నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపించిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. జిల్లాస్థాయి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. యువ ఉత్సవ్‌లో యువత తమ పేర్లను నమోదు చేయించుకోవాలని, మరిన్ని వివరాలకు సెల్ 9494131671ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండేటి ఈశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబును కలిసిన అల్లాడ

అమలాపురం అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు శుక్రవారం అమరావతిలో సీఎం చంద్రబాబును కృతజ్ఞతాపూర్వకంగా కలుసుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఉన్నారు.

- ఆంధ్రజ్యోతి/అమలాపురం

బీబీఫాతిమా జెహరాకు ఘన నివాళి

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి భారీగా ముస్లిం మహిళలు రాక



పాశర్లపూడి దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం మహిళలు

మామిడికుదురు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త తనయురాలు బీబీఫాతిమా జెహరాకు ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘన నివాళులర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలంలో ప్రసిద్ధి చెందిన పాశర్లపూడి దర్గా వద్ద పాతిమాజెహరా షహదత్ మజ్లిస్ శుక్రవారం జరిగింది. రాష్ట్రంలో ఏకైక దర్గాగా ప్రాచుర్యం పొందిన ఈ దర్గాకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లింలు భారీగా తరలివచ్చి మజ్లిస్ నిర్వహించారు. ముస్లిం క్యాలెండర్ ప్రకారం ప్రతీ సంవత్సరం చివరి నెల 3వ తేదీన షహదత్‌ను నిండుశోకంతో నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఈ దర్గాలోకి మహిళలకు మాత్రమే ప్రవేశం ఉంది. పురుషులు, గర్భిణులు దర్గా బయట నుంచే ప్రార్థనల్లో, మజ్లిస్‌లో పాల్గొనడం విశేషం. దర్గాను సందర్శిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ముస్లిం మహిళల పరదా గురించి చాటిచెప్పిన ఆదర్శ మహిళగా ఫాతిమాజెహరాను ముస్లింలు కొలుస్తారు. ఇమామ్ హుస్సేన్, హజరత్ఇమామ్‌హసన్, బీబీజైనబ్‌ల తల్లిగా ఫాతిమా జెహరాకు ఇస్లాం చరిత్రలో ప్రత్యేక గుర్తింపు ఉంది. వివిధ రాష్ట్రాలకు చెందిన ముస్లిం భక్తులు శుక్రవారం దర్గాకు వచ్చి షహదత్‌లో పాల్గొని ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక ముస్లిం సంఘాలు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు వసతి, భోజన సదుపాయాలు కల్పించారు.

టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడిపై బీరు బాటిల్‌తో దాడి -9లో

మధురపూడి విమానాశ్రయం



ఆయ్.. ఇది.. గోదారోళ్ల ఎయిర్‌పోర్టు!

- రోజుకు 22 విమానాలు.. 1600 మంది ప్రయాణం
- అతి పెద్ద విమానమూ దిగే రన్‌వే ఇక్కడి ప్రత్యేకత
- రూ.347 కోట్లతో మరో టెర్మినల్ నిర్మాణం
- నేడు పౌర విమానయాన దినోత్సవం

- ఆంధ్రజ్యోతి/ రాజమహేంద్రవరం

'ఆయ్.. మా రాజమండ్రిలో ఇమానం ఎక్కి హైదరాబాద్ వచ్చామండి'.. మా ఎయిర్‌పోర్టు ఎంతో అందంగా ఉంటది తెలుసాండీ'. నిజమే.. రాజమహేంద్రవరం కీర్తి కిరీటంలోని కలికితురాళ్లలో మధురపూడి విమానాశ్రయం ఒకటి. దీనిని ముద్దుగా గోదారోళ్ల విమానాశ్రయం అని కూడా పిలుచుకుంటారు. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ఈ ఎయిర్‌పోర్టు అభివృద్ధిలో వాయు వేగంతో దూసుకుపోతోంది. అటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా.. ఇటు పాలకుల చొరవ.. ముఖ్యంగా ప్రయాణికుల ఆదరణతో ఎంత పెద్ద విమానమైనా దిగే దశకు చేరుకొంది. గత ఏడాది సీ-30, సీ-31 వంటి యుద్ధ విమానాలు కూడా ఇక్కడ దిగాయి. మరో 20 ఏళ్ల అవసరాలకు సరిపడా సాధనా సంపత్తినీ సమకూర్చుకుంటోంది. ఆ వైపున కోనసీమ నుంచి ఇటు మెట్ట, ఏజెన్సీని కలుపుకొని మొత్తం ఆరు జిల్లాల వారికి నిరంతరం సేవలందిస్తోంది. నేడు అంతర్జాతీయ పౌరయాన దినోత్సవం సందర్భంగా గోదారోళ్ల విమానాశ్రయం (మధురపూడి ఎయిర్‌పోర్టు) గురించి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

రన్‌వేలో విమానం





● ఇంతింతై.. ఎయిర్‌బస్‌లు ఎగిరేంతై..

ఈ విమానాశ్రయాన్ని బ్రిటీషర్లు తమ అవసరాల కోసం సుమారు 300 ఎకరాల్లో నిర్మించారు. తర్వాత వాణిజ్య, విద్య, మెడికల్ తదితర రంగాల్లో ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందడంతో అదే తీరులో విమానాశ్రయం అభివృద్ధి చెందింది. రెండో విడత 800 ఎకరాలకు, తర్వాత 1218 ఎకరాలకు విస్తరించారు. 1985 నుంచి 1994 వరకూ వాయుదూత్ విమానాలను నడిపారు. ఇప్పుడు ఇక్కడ 3,165 మీటర్ల రన్‌వే ఉండగా.. గంటకు 10 విమానాలు.. రోజుకు 50 విమానాలు వచ్చి వెళ్లినా ఆపరేట్ చేయగలిగిన సామర్థ్యం ఉంది. దేశంలో అతిపెద్ద విమానాలు సైతం రాకపోకలు సాగించే స్థాయికి చేరుకొంది. ప్రస్తుతం రోజుకు 22 మంది విమానాలు నడుస్తుండగా 1,600 మంది వరకూ రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు ఎయిర్‌పోర్ట్ తెరుస్తారు. 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటివరకూ చెన్నై, హైదరాబాద్, బెంగళూరుకు సర్వీసులున్నాయి. చిన్న విమానాలు మాత్రమే నడుస్తున్నాయి. తొలిసారిగా ముంబైకి ఇటీవల ఎయిర్‌బస్‌ని ప్రారంభించారు. ఈనెల 12 నుంచి ఢిల్లీకి విమానం అందుబాటులోకి రానుంది. హ్యాంగర్స్ (విమానాల పార్కింగ్ ప్రదేశం)కి అవసరమైన స్థలం ఉంది.

మరో టెర్మినల్ నిర్మాణం

ప్రస్తుతం ఒక టెర్మినల్ అందుబాటులో ఉంది. అయితే రానున్న 20 ఏళ్ల ట్రాఫిక్‌ని దృష్టిలో పెట్టుకొని 21 వేల చదరపు మీటర్లలో రూ.347 కోట్లతో మరో టెర్మినల్‌ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఆగస్టు నాటికి ఇది అందుబాటులోకి వచ్చే విధంగా పనులు జరుగుతున్నాయి. దీని నిర్మాణం పూర్తయితే ఒకేసారి 2వేల మంది ప్రయాణికులను హ్యాండిల్ చేయగలిగిన సామర్థ్యం ఉంటుంది. ప్రయాణికులకు సదుపాయాలు, కార్గో, పార్కింగ్ వంటివి అంతర్జాతీయ స్థాయిలో ఉంటాయి.

● ఇవీ అందుబాటులోకి వస్తే...

మన ప్రాంతంలోని కాకినాడ నుంచి సముద్ర ఉత్పత్తులు, భీమవరం నుంచి రొయ్యలు, కోనసీమ నుంచి కొబ్బరి ఉత్పత్తులు, వస్త్రాల రవాణా ఎక్కువగా ఉంటోంది. రాజమండ్రిలోని వాణిజ్యంలో వస్త్ర దుకాణాలు మొదటి వరుసలో ఉంటాయి. ఈ నేపథ్యంలో కార్గో అవసరత ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఆ సేవలు అందిస్తున్నా.. చిన్న విమానాలు కావడంతో ఎక్కువగా ఉపయోగం లేకపోయింది. ఇప్పుడు ముంబైకి ఎయిర్‌బస్ ప్రారంభం కావడంతో.. మొత్తం కలిసి రోజుకు 5 టన్నుల వరకూ సరుకు రవాణా చేసే వెసులుబాటు కలిగింది. అదేవిధంగా ఈ ప్రాంతం నుంచి ఆధ్యాత్మిక, పర్యాటక ప్రయాణాలు కూడా ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం తిరుపతి, శిరిడీకి రైళ్లలో బెర్తులు దొరకడం అదృష్టంపై ఆధారపడి ఉంటోంది. ఆయోధ్యకు అసలు నేరుగా రైలు సదుపాయం లేదు. ఈ సీజన్‌లో శబరిమల (కోచి ఎయిర్‌పోర్ట్)కూ స్వాములు ఎక్కువగానే విమానాలను ఆశ్రయిస్తున్నారు. వీటిని కూడా విమానయాన సంస్థలు అందిపుచ్చుకోవచ్చు. అయితే ప్రస్తుతం ఇండిగో సంస్థ ఒకటే ఇక్కడ నుంచి విమానాలను ఆపరేట్ చేస్తోంది. విమానాశ్రయం అభివృద్ధి చేయడమే కాకుండా మరిన్ని విమానయాన సంస్థలు విమానాలు నడిపేలా చర్యలు తీసుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది. జనాదరణ బాగానే ఉన్నా ఆపరేటర్లు లేని పరిస్థితి నుంచి బయటపడాలి. అలాగే ముఖ్యంగా ఎయిర్ అంబులెన్స్‌ని అందుబాటులోకి తీసుకురావాలి. దేశీయంగా మరిన్ని నగరాలకు, అంతర్జాతీయంగా ఒకటి రెండు దేశాలకు విమాన సర్వీసులు తిరిగితే బాగుంటుంది.

140 మందితో 24 గంటలూ రక్షణ

ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షక దళం (ఏపీఎస్‌పీఎఫ్) చూస్తోంది. కమాండెంట్ కేఎస్ రావు పర్యవేక్షణలో ఓ డీఎస్పీ ఆధ్వర్యంలో 140 ఎస్‌పీఎఫ్ సిబ్బంది షిఫ్టుల వారీగా విధుల్లో ఉంటారు. బోర్డింగ్ పాస్‌ల చెకింగ్, ప్రయాణికుల రాకపోకల్లో తనిఖీ, లగేజీ స్కానింగ్ వంటివన్నీ క్షుణ్ణంగా నిర్వహిస్తున్నారు. సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ విధివిధానాలను అనుసరించి పని చేస్తున్నారు. మహిళల చెకింగ్ కోసం మహిళా పోలీసులనూ అందుబాటులో ఉంచుతున్నారు.

మరింత విస్తరణ దిశగా..

అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ 50వ వార్షికోత్సవం సందర్భంగా 1994లో తొలిసారిగా అంతర్జాతీయ పౌర విమానయాన దినోత్సవం నిర్వహించారు. విమానయాన రంగం వల్ల ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలు, సేవలు, అభివృద్ధి వంటి వాటిపై ఆ రోజున అవగాహన కల్పిస్తారు. 2050 నాటికి జనాభాలో మూడింట రెండు వంతుల మంది నగరాల్లోనే నివసిస్తారని, విమాన ప్రయాణాలు విస్తరిస్తాయని ఐక్యరాజ్య సమితి అంచనా వేస్తోంది.

కొత్త సర్వీసులకు ప్రయత్నిస్తున్నాం..

వచ్చే వేసవికాలం నాటికి శిరిడీ, తిరుపతి, కోల్‌కతా, గోవా, అయోధ్య తదితర నగరాలకు విమానలు నడిపే ప్రయత్నాలు చేస్తున్నాం. మిగతా ఎయిర్‌లైన్స్ సర్వీసుల ఆపరేటర్లు కూడా ముందుకు వస్తే బాగుంటుంది. విమానాశ్రయంలో సేఫ్టీ, సెక్యూరిటీ నూరు శాతం ఉంది. సదుపాయాల పరంగా అన్నీ ఉన్నాయి. అందువల్ల మరిన్ని విమానాలను అందుబాటులోకి తీసుకొచ్చే కృషి జరగుతోంది.

- ఎస్.జ్ఞానేశ్వరరావు, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్





నిర్విరామంగా సుమారు 20 నిమిషాలపాటు ఓంకార ప్రణవనాదాన్ని ధ్వనిస్తూ శంఖాన్ని పూరించడంలో అనేక రికార్డులను కైవసం చేసుకున్న డాక్టర్ కొండ నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులను కామధేను జాతీయ పురస్కారాలు -2024కి ఎంపిక చేసినట్టు విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రకటించింది. దీనిని ఈనెల 8న హైదరాబాద్‌లో నిర్వహించే నరసింహారావు రాజమహేంద్రవరం ప్రాంతీయ కేంద్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షక దళం కమాండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 38 ఏళ్లుగా వివిధ కార్యక్రమాల్లో శంఖాన్ని పూరించి అనేక పురస్కారాలను అందుకున్నారు.

అఖండ శంఖారావ యుగళం దంపతులకు జాతీయ పురస్కారం

పి.గన్నవరం/రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిర్విరామంగా సుమారు 20 నిమిషాలపాటు ఓంకార ప్రణవనాదాన్ని ధ్వనిస్తూ శంఖాన్ని పూరించడంలో రికార్డులను కైవసం చేసుకున్న పి.గన్నవరం గ్రామానికి చెందిన ఏపీఎస్పీఎఫ్ కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులు తాజాగా విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ కామదేను అవార్డ్స్-2024 జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు సంబంధిత సంస్థ ఒక ప్రకటనలో తెలిపినట్టు నరసింహారావు తెలిపారు. ఈ అవార్డును ఈనెల 8న హైదరాబాదులో జరగబోయే అవార్డుల ప్రదానోత్సవంలో నరసింహారావు దంపతులకు కామదేను జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్టు సంస్థ వ్యవస్థాపకులు రాంబాబు నుంచి ఆహ్వానం అందింది. ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఏపీఎస్పీఎఫ్ (ఏపీ ప్రత్యేక రక్షణ దళం) కమాండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కొండా నరసింహారావు దంపతులు ఆఖండ శంఖారావ యుగళంగా పేరుగాంచారు. అంతేకాకుండా గత 38 ఏళ్లుగా వేలాది ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని అఖండ శంఖారావాన్ని పూరించి పలు సంస్థలు నుంచి సువర్ణ ఘంటా కంకణాలు, సన్మానాలతోపాటు పలు అవార్డులు స్వీకరించారు. అలాగే దేశంలోని పలు ప్రాంతాల్లో శంఖారావం పూరించి పలువురు ప్రశంసలు పొందారు. అవార్డుకు ఎంపికైన కమాండెంట్ దంపతులకు పలువురు అభినందనలు తెలిపారు.

బియ్యం డంప్‌పై అధికారుల దాడులు



బియ్యంను పరిశీలిస్తున్న అధికారులు

తునిరూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా తుని మండలం కొలిమేరు సమీపంలో అక్రమంగా బియ్యం నిల్వలు దాచి పెట్టారన్న సమాచారంతో తుని రెవెన్యూ అధికారులు ఆకస్మిక దాడులు చేపట్టారు. కొలిమేరు గ్రామ శివారు మూతపడిన కోళ్ళఫారంలో సుమారు 500బస్తాలు బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. ఈ బియ్యం అదే గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధి రైస్‌మిల్ నుంచి గుట్టుచప్పుడు కాకుండా పొలాల మధ్యన ఉన్న కోళ్ళఫారంకు తరలించినట్లు తెలుస్తోంది. దీనిపై రెవెన్యూ అధికారులను ఆరా తీయగా సంబంధిత నిల్వల్లో రేషన్ బియ్యంగా అనుమానం ఉందని బియ్యం శాంపిల్స్‌సేకరించి ల్యాబ్‌కు తరలించ నున్నట్లు తెలిపారు. తుది నివేదిక ఆధారంగా కోళ్ళ ఫారం నిర్వాహకుల పై చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంఎస్‌వో బి.రాజు, ఆర్ఐ తాతారెడ్డి, రూరల్ ఎస్ఐ కృష్ణమాచార్యులతోపాటుగా స్థానిక వీఆర్వో ఉన్నారు.

షష్ఠి ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి

నేడు బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరుడి షష్ఠి



బిక్కవోలు షష్ఠి పందిరి అలంకరణ



స్వాగతం పలుకుతున్న వెంకటేశ్వరస్వామి సెట్టింగ్

బిక్కవోలు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో పేరొంది శనివారం నిర్వహించే బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరుడి షష్ఠి ఉత్సవానికి అన్నిఏర్పాట్లు పూర్తయ్యాయని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. శనివారం తెల్లవారుజామున 1-20 గంటకు స్వామివారి తీర్థపుబిందె సేవతో ఉత్సవాలను ప్రారంభిస్తామన్నారు. అప్పటి నుం చి భక్తులకు స్వామి దర్శనాలు కల్పించనున్నట్టు తెలిపారు. భక్తుల దర్శనాలకు భారీ లైన్లు ఏర్పాటు చేశామన్నారు. ఆలయ ఆవరణ అంతా చలువ పందిరి వేసి విద్యుత్ దీపాలతో అలంకరించామని చెప్పారు. శనివారం ఉదయం స్వామివారిని మయూర వాహనంపై గ్రామోత్సవం, ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ ఆలయ ఆవరణలో వివిధ బ్యాండు కచేరీలు, 4.30 గంటల నుంచి 5.30 వరకూ పగలు బాణాసంచా ఉంటుందని రాత్రి 11గంటల నుంచి తెల్లవారే వరకూ స్థానిక ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన గోలింగేశ్వరా ఫైర్ వర్క్స్, కనక దుర్గా హుస్సేనియా ఫైర్‌వర్క్స్ వారిచే బాణాసంచా పోటీలు జరుపుతామన్నారు. రాత్రి 8గంటల నుంచి స్వామివారి గ్రామోత్సవం కన్నుల పండువగా జరుపుతామన్నారు. ఆదివారం మధ్యాహ్నం స్వామివారి రథోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ నెల 12న మహాన్నదానంతో షష్ఠి ఉత్సవాలను ముగిస్తామన్నారు. 7 నుంచి 11 వరకూ షష్ఠి కళావేదికపై వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

270 మందితో పోలీసు బందోబస్తు

షష్ఠి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆధ్వర్యంలో 270 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు అనపర్తి సీఐ సుమంత్, బిక్కవోలు ఎస్ఐ రవిచంద్రకుమార్ తెలిపారు. వీరిలో ఒక అడిషనల్ ఎస్పీ, నలుగురు డీఎస్పీలతోపాటు తొమ్మిది మంది సీఐలు, 19 మంది ఎస్ఐలు, 70 మంది మహిళా పోలీసులు, హోమ్‌గార్డులు, యాభై మంది ఏఎస్ఐ, హెచ్‌సీలు, 67 మంది కానిస్టేబుళ్లు, హోమ్‌గార్డులు విధులు నిర్వహిస్తారన్నారు. షష్ఠి సందర్భంగా ట్రాఫిక్ దృష్ట్యా బిక్కవోలు మెయిన్‌రోడ్‌లో ఫోర్ వీలర్లకు డిసెంబరు 7, 8 తేదీల్లో అనుమతులు నిలిపి వేశామని, వాహన యజమానులు సహకరించాలని వారు కోరారు.

సంతాన సుబ్రహ్మణ్యుడికి ఐదు రోజుల ఉత్సవాలు





రాజానగరంలోని శ్రీవల్లీదేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, విద్యుద్దీపాలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయం

రాజానగరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజానగరంలో సంతాన సౌభాగ్య ప్రదాతగా భక్తుల పూజలందుకుంటున్న శ్రీ వల్లీ దేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు శనివారం నుంచి 11వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవకమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. రాజమహేంద్రవరం వాస్తవ్యుడు తోట సత్యనారాయణ మూర్తి దంపతులు ప్రతిష్ఠించిన ఈ ఆలయం 98 వసంతాలు పూర్తి చేసుకుంటోంది. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం స్వామి కల్యాణం కన్నుల పండువగా జరుగుతుంది. సంతానం లేమితో బాధపడతున్న మహిళలు షష్ఠిరోజు నాగుల చీర ధరించి ఉపవాసదీక్షతో స్వామివారి సన్నిధిలో శయనిస్తారు. సాయంత్రం జరిగే స్వామి వారి కల్యాణాన్ని తిలకించి, తలంబ్రాలు బియ్యం చీరకొంగుతో ఒడిసి పట్టుకుని అనంతరం ఇంటికి వచ్చి క్షీరాన్నం వండుకుని భుజిస్తే సంతానం కల్గుతుందని భక్తులు విశ్వసిస్తారు. ఐదు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నాయి.ఉత్సవ కమిటీ ప్రత్యేక భారి కేడ్లు ఏర్పాటు చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడు పెండ్లి కొడుకాయనే..

● నేటి రాత్రికి దివ్యకల్యాణం



పెండ్లి కుమారుడు, పెండ్లికుమార్తెలుగా సుబ్రహ్మణ్యేశ్వరుడు, వల్లీదేవసేనలకు పూజలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్యకల్యాణ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 4గంటలకు ప్రత్యేక వేదికపై నవవదూవరులు కానున్న స్వామి,అమ్మవార్లను ఆశీనులు గావించి పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం ఉల్లాకుల గౌరీపూజను నిర్వహించిన అనంత రం ముత్తైదువులు పసుపుదంచారు. ఈసందర్భంగా స్వామి,అమ్మవార్లకు నుదుట తిలకం బుగ్గనచుక్క పెట్టి దివ్యాభరణాలను అలంకరించారు. రాత్రి 7గంటలకు మయూ ర, శేషతల్ప వాహనాలపై వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయకమిటీ ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.

సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

సుబ్రహ్మణ్య షష్ఠి పురస్కరించుకుని శనివారం రాత్రి 8గంటలకు దివ్యకల్యాణం దేవస్థానం హైస్కూల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహిస్తారు. ఉదయం అన్నవరం పరిసర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా క్యూలైన్స్, ప్రసాదం వితరణ కేంద్రాలు, కమిటీ ఏర్పాటుచేశారు. ఆదివారం రాత్రి జరిగే శ్రీపుష్పయోగంతో వేడుకలు ముగుస్తాయి.

పసుపు దంచుతున్న ముత్తైదువులు



సత్యదేవుడి దత్తత ఆలయంగా

బలిఘట్టం సత్యదేవుడి ఆలయం

● పత్రాలను దేవస్థానం అధికారులకు అందజేసిన శాసనసభ స్పీకర్

అన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి దత్తత ఆలయంగా అనకాపల్లిజిల్లా బలిఘట్టం సత్యదేవుడి ఆలయం చేరింది. దీనిని లాంఛ నంగా శుక్రవారం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రత్నగిరికి విచ్చేసి లాంఛనప్రాయంగా సంబంధిత పత్రాలను దేవస్థానం ఈవో త్రినాథరావు, చైర్మన్ రోహిత్‌లకు అందజేశారు. గతంలో ఈ ఆలయాన్ని అన్నవరం దేవస్థానం నిధులు సుమారు రూ.45లక్షలతో నిర్మించారు. వీటి నిర్వహణను అప్పట్లో ఆ గ్రామపెద్దలు చూసుకునేవారు. అనంతరం నిర్వహణా భారం, ప్రత్యేకశ్రద్ధను ఎవరూ కనబరచకపోవడంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రతిపాదన మేరకు దేవదాయశాఖ అంగీకారం తెలిపింది. ఈ ఆలయానికి సుమారు 36ఎకరాల భూమి ఉండ గా ఆ పత్రాలను దేవస్థానం అధికారులు తీసుకున్నా రు. దీని నిర్వహణకు ఏటా రూ.5లక్షల వ్యయం అవుతుందని అధికారులు తెలిపారు. ఇప్పటికే అన్న వరం దేవస్థానం పరిధిలో దత్తత ఆలయాల సంఖ్య తొమ్మిదికి చేరింది. అంతకు ముందు ఆలయానికి విచ్చేసిన అయ్యన్నపాత్రుడు కుటుంబసభ్యులకు దేవస్థానం ఈవో త్రినాథరావు, చైర్మన్ రోహిత్‌లు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కొండలరావు, సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.



బలిఘట్టం ఆలయ దత్తతకు సంబంధించిన పత్రాలు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

'లోవ'లో హుండీల లెక్కింపు

తునిరూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆలయం ఉన్నతాధికారులు శుక్రవారం హుండీలు లెక్కించారు. అమ్మవారిదేవస్థానానికి సంబంధించిన హుండీలు తెరిచి లెక్కించగా 76రోజులకు రూ.39,39,250లు ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ఉప కమిషనర్, కార్యనిర్వాహణాధికారి కె.విశ్వనాధ్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యానాయుడు, ధర్మకర్తలతోపాటుగా ప్రత్యేకాధికారిగా తంటికొండ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.సత్యనారాయణ, సిరిపురం గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారిణి ఎం.సూర్యామణి ఉన్నారు.



ఆలయ ప్రాంగణంలో హుండీలు లెక్కిస్తున్న సిబ్బంది

దశాబ్దాల కల సాకారం

రామచంద్రపురంలో జిల్లా అదనపు సెషన్స్‌ కోర్టు సిద్ధం
ఈనెల 10న ప్రారంభించనున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా రామచంద్రపురం ప్రజల దశాబ్దాల కల సాకారం అవుతుంది. ప్రజలు ఎదురుచూస్తున్న జిల్లా అదనపు సెషన్స్‌ కోర్టు రామచంద్రపురంలో ప్రారంభానికి సిద్ధ అయ్యింది. ఈ నెల 10న రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ ధీరజ్‌ సింగ్‌ ఠాకూర్‌ రామచంద్రపురంలో జిల్లా అదనపు సెషన్స్‌ కోర్టును వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. దీంతో రామచంద్రపురం పరిసర మండలాల ప్రజలు, కక్షిదారులు, న్యాయవాదులకు జిల్లా కోర్టు బెంచి ద్వారా న్యాయసేవలు చేరువ కానున్నాయి.



రామచంద్రపురంలో జిల్లా అదనపు సెషన్స్‌ కోర్టు భవనం

రామచంద్రపురం (ద్రాక్షారామ) డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో 1994 నుంచి జిల్లా సెషన్స్‌ కోర్టు బెంచి ఏర్పాటు ప్రయత్నాలు ప్రారంభించారు. పలు బార్‌ అసోసియేషన్‌ కార్యవర్గాలు, సీనియర్‌ న్యాయవాదులు, ప్రజా ప్రతినిధులు జిల్లా సెషన్స్‌ కోర్టు ఏర్పాటుకు ప్రయత్నాలు చేశారు. అయితే ప్రస్తుత బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు పిల్లి మురళీ, కార్యవర్గం, ఇతర సీనియర్‌ న్యాయవాదుల కృషి ఫలించింది. దీంతో 15 మార్చి 2024న రామచంద్రపురంలో జిల్లా అదనపు సెషన్స్‌కోర్టు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఎన్నికల కోడ్‌ రావడంతో కొంత ఆలస్యం జరిగింది. తిరిగి కోర్టు ఏర్పాటు వేగవంతంగా జరిగింది. 1931 నుంచి జూనియర్‌ సివిల్‌జడ్జి కోర్టు నిర్వహిస్తున్న భవనంలో జిల్లా అదనపు సెషన్స్‌ కోర్టు ఏర్పాటు చేశారు. జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టును బార్‌ అసోసియేషన్‌ భవనంలోకి మార్చి నిర్వహిస్తున్నారు.

వర్చువల్‌గా ప్రారంభం...

రామచంద్రపురంలో ఏర్పాటు చేసిన జిల్లా అదనపు సెషన్స్‌ కోర్టును రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ ధీరజ్‌ సింగ్‌ ఠాకూర్‌ ఈనెల 10న ఉదయం 10.15 గంటలకు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలనా న్యాయమూర్తి నైనాల జయసూర్య, న్యాయమూర్తులు ఆర్‌.రఘునందనరావు, బీవీఎల్‌ఎన్‌ చక్రవర్తి, టి.మల్లి ఖార్జున, సుమతిజగడం, న్యాపతి విజయ్‌ సమక్షంలో ప్రారంభోత్సవం జరుగుతుందని బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు పిల్లి మురళీ, కార్యదర్శి వాడ్రేవు సాయి ప్రసాద్‌ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్‌ జిల్లా జడ్జి గంధం సునీత పాల్గొంటారన్నారు.

తీరనున్న ప్రజల కష్టాలు...

రామచంద్రపురంలో జిల్లా అదనపు సెషన్స్‌ కోర్టు ఏర్పాటుతో ప్రజలు, కక్షిదారుల కష్టాలు తీరనున్నాయి. జిల్లా కోర్టుసేవలు ప్రజలకు మరింత చేరువకానున్నాయి. ఇప్పటివరకు రామచంద్రపురం జూనియర్‌ సివిల్‌ జడ్జి, సీనియర్‌ సివిల్‌ జడ్జి, మెజిస్ట్రేట్‌ కోర్టు తీర్పులు, ఆలమూరు జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టు, అనపర్తి జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టు తీర్పులపై అప్పీలుకు జిల్లా కోర్టు పరిధిలోకి వచ్చే సివిల్‌, క్రిమినల్‌ కేసులకు రాజమహేంద్రవరం జిల్లా సెషన్స్‌ కోర్టుకు వెళ్లవలసి వచ్చేది. రామచంద్రపురంలో జిల్లా కోర్టు ఏర్పాటుతో రామచంద్రపురం పట్టణం, మండలం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, ఆలమూరు, రాయవరం, మండపేట, అనపర్తి, బిక్కవోలు మండలాల ప్రజలకు దూరభారం తప్పనుంది.

మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు

» ఏలూరు రేంజ్‌ ఐజీ అశోక్‌కుమార్‌ » కోట సత్తెమ్మతల్లి ఆలయంలో పూజలు


కోటసత్తెమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఐజీ, ఎస్పీ


నిడదవోలు పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్‌

నిడదవోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు రేంజ్‌ ఐజీ జి.అశోక్‌కుమార్‌ తెలిపారు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మతల్లిని శుక్రవారం ఆయన, జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్‌ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం, పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం నిడదవోలు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించి కేసుల పురో గతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్‌ కుమార్‌ విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక గస్తీని పెంచడంతో పాటు యువతకు కళాశాలల్లో కౌన్సెలింగ్‌ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏదైనా సంఘటన జరిగితే పోలీసులు తక్షణం స్పందించి పరిష్కారం దిశగా పనిచేసేలా అధికార్లకు సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు. జిల్లావ్యాప్తంగా కేసులకు సంబంధించి వాటి పురోగతిపై ప్రతివారం సమీక్ష చేస్తున్నామన్నారు. ప్రత్యేకంగా తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీని ఆనుకుని ఉండడంతో గంజాయిపై ప్రత్యేక దృష్టి సారించి నిఘా పెట్టామని తెలిపారు. ఒరిస్సా, వైజాగ్‌, ఏఎస్‌ఆర్‌ జిల్లాల పోలీస్‌ అధికారులు సమన్వయంతో గంజాయి రవాణాను నివారించేందుకు ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. వారి వెంట అడిషనల్‌ ఎస్పీ ఎన్‌వీ. మురళీకృష్ణ, కొవ్వూరు డీఎస్పీ దేవ కుమార్‌, సీఐ తిలక్‌, ఎస్‌ఐలు శోభన్‌కుమార్‌, సతీష్‌ ఉన్నారు.

టైరు పేలి అదుపు తప్పి... లారీని ఢీకొన్న వ్యాన్‌

వ్యాన్‌ డ్రైవర్‌ మృతి



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన వ్యాన్‌


నరసింహులు (ఫైల్‌ ఫొటో)

నల్లజర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లా తాడిపర్తి మండలం చుక్కలూరు గ్రామానికి చెందిన శ్యామర్ల నరసింహులు(30) మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నరసింహులు అనంతపురం నుంచి రాజమహేంద్రవరానికి వ్యాన్‌లో దానిమ్మ కాయల లోడుతో వస్తున్నాడు. దూబచర్ల వద్ద వ్యాన్‌ ముందు టైరు పేలి అదుపు తప్పి డివైడర్‌ అవతల వైపు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్‌ నరసింహులు అక్కడికక్కడ మృతిచెందగా వ్యాన్‌ నుజ్జునుజ్జు అయ్యింది. దానిమ్మకాయల లోడు రోడ్డుపై పడిపోవడంతో స్థానికులు కాయల కోసం ఎగబడ్డారు. కాగా నరసింహులుకు భార్య మహాలక్ష్మీ, కుమారుడు మనోజ్‌ ఉన్నారు. రాజమహేంద్రవరం వెళ్లి వస్తానని చెప్పి విగత జీవిగా పడి ఉండడంతో భార్య, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎస్‌ఐ సోమరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు.

గాడాలలో విజిలెన్స్‌ తనిఖీలు

రూ.5,28,271 విలువైన ఎరువులు సీజ్‌


గాడాలలో గొడౌన్‌ను తనిఖీ చేస్తున్న స్నేహిత

కోరుకొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని లక్ష్మీగణేష్‌ ట్రేడర్స్‌ ఫెర్టిలైజర్స్‌ షాపును శుక్రవారం రీజనల్‌ విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారి ఎం.స్నేహిత ఆధ్వర్యంలో విజిలెన్స్‌, వ్యవసాయ శాఖ, లీగల మెట్రాలజీ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 8 ఎకరాల ఎరువుల్లో వ్యత్యాసం ఉండడం వల్ల షాపు యజమానిపై మండల వ్యవసాయాధికారి 6ఏ కింద కేసు నమోదు చేశారు. సుమారు రూ.4,85,271 విలువైన 21.900మెట్రిక్‌ టన్నుల ఎరువులను సీజ్‌ చేశారు. 10కిలోల వీనస్‌ సాయిల్‌, ఎఫ్‌7, సుప్రీం బ్యాగ్‌పై యూనిట్‌ విక్రయ లేకపోవడంపై లీగల్‌ మెట్రాలజీ అధికారులు రూ.43వేలు విలువై 40 బ్యాగులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ షాపులో మొత్తం రూ.5,28,271 విలువ గల ఎరువులను సీజ్‌ చేశారు. ఈ సందర్భంగా స్నేహిత మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్‌ విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ పరిధిలోని 3 జిల్లాలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందు దుకాణాల్లో నిరంతరం తనిఖీలు కొనసాగుతాయన్నారు. గరిష్ట అమ్మకం ధర కంటే ఎక్కువ అమ్మినా, అక్రమ నిల్వలు కలిగి ఉన్నా, నకిలీ విత్తనాలు అమ్మినా, స్టాక్‌ రిజిస్టర్‌లు సక్రమంగా నిర్వహించకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్‌ డీఎస్‌టీ తాతారావు, తహశీల్దార్‌ విజయ్‌కుమార్‌, లోవరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ దొంగలకు భరోసా కల్పించేందుకే జగన్‌ యాత్ర

కాకినాడ నుంచి ప్రారంభిస్తే ద్వారంపూడి అక్రమాలు బయటకు
సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ధ్వజం

కాకినాడ సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ దొంగలకు భరోసా కల్పించేందుకే జగన్‌ యాత్ర చేపడుతున్నారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వనమాడి కొండబాబు ధ్వజమెత్తారు. కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పథకం ప్రకారమే బియ్యం మాఫియా రెచ్చిపోయిందన్నారు. అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఎన్నో అక్రమాలు, అరాచకాలకు పాల్పడ్డారన్నారు. అవి ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయన్నారు. ద్వారంపూడి చేసిన అక్రమాలను నాడు ఆరోపించిన తాము ఇప్పుడు ఆధారాలతో సహా సంబంధిత అధికారులకు అందించామన్నారు. కాకినాడ పోర్టు నుంచి రేషన్‌ బియ్యం అక్రమంగా తరలించడంలో అప్పటి సీఎం జగన్‌రెడ్డి సహకారంతో చంద్రశేఖరరెడ్డి ఎమ్మెల్యేగాను, భాస్కరరెడ్డి పౌరసరఫరాలశాఖ చైర్మన్‌గాను, వీరభద్రారెడ్డి రాష్ట్ర రైస్‌ మిల్లర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగాను రేషన్‌బియ్యం మాఫియా నడిపారన్నారు. మాజీ సీఎం జగన్‌ వైసీపీకి చెందిన దొంగలకు భరోసా కల్పించేందుకే యాత్ర చేపడుతున్నారని, కాకినాడ నుంచి ప్రారంభిస్తే ద్వారం పూడి అక్రమాలు బయటకు వస్తాయన్నారు. నాడు బియ్యం వ్యాపారంలో తాము కింగులం అన్న ద్వారంపూడి నేడు చాలా చిన్నవాళ్లమని చెప్పి బేలతనాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. అక్రమాలకు ఉపయోగించుకున్న కాకినాడ పోర్టు పేరు ప్రఖ్యాతలను తిరిగి నిలబెడతామని కొండబాబు చెప్పారు.

జేఎన్టీయూకేలో...
డ్రోన్‌ డవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్‌

జేఎన్టీయూకే, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని సెనేట్‌ హాల్లో డ్రోన్‌ డెవలప్‌మెంట్‌ అనే అంశంపై ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ డైరెక్టరేట్‌ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాన్‌టెక్‌ ల్యాబ్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ సహకారంతో వర్క్‌షాప్‌ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఏపీని భారతదేశానికి డ్రోన్‌ రాజధానిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. డ్రోన్‌ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో సీఈ వి.శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వీసీ మురళీకృష్ణ

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

కాకినాడ జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌ లావణ్యకుమారి
ప్లాస్టిక్‌ సర్జరీపై రెండోరోజు రాష్ట్రస్థాయి సదస్సు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న లావణ్యకుమారి

జీజీహెచ్‌ (కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో నూతన మెళకువలను అందిపుచ్చుకుని నిష్ణాతులైన వైద్యనిపుణులుగా తీర్చిదిద్ది పేదలకు మెరుగైన వైద్యచికిత్సను అందించాలని కాకినాడ జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఎస్‌.లావణ్యకుమారి ఆకాంక్షించారు. అసోసియేషన్‌ ఆఫ్‌ ప్లాస్టిక్‌, రీకనస్ట్రక్టివ్‌ అండ్‌ ఈస్తటిక్‌ సర్జన్‌ ఆఫ్‌ ఆంధ్రప్రదేశ్‌ అండ్‌ తెలంగాణ(ఏపీఆర్‌ఏఎస్‌సీఓన్‌)-2024 ఆధ్వర్యంలో జరుగుతున్న 21వ యాన్యువల్‌ సదస్సు రెండో రోజైన శుక్రవారం వివేకానంద పార్క్‌ ప్రాంగణంలోని ఫ్యాబిన్‌ కన్వెన్షన్‌ హాల్లో డాక్టర్‌ లావణ్యకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఏపీఆర్‌ఏఎస్‌సీఓన్‌ అధ్యక్షుడు డాక్టర్‌ డీవీ కృష్ణారావు, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ జీజీహెచ్‌ ప్లాస్టిక్‌ సర్జరీ విభాగాధిపతి డాక్టర్‌ బి.రత్నభూషణ్‌ ఆధ్వ ర్యంలో జరుగుతున్న ఈ సదస్సులో ఎన్నో నూతన ఆవిష్కరణలకు తెరలేపి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కావాల్సిన నైపుణ్యతను, నూతన మెళకువలను క్షుణ్ణంగా తెలుసుకునేలా అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌ సర్జరీలో కొత్తపు ంతలు తొక్కుతున్న సాంకేతిక విధానాలను, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించారు. శుక్రవారం జరిగిన సైంటిఫిక్‌ సెషన్‌కు దేశ నలుమూలల నుంచి వచ్చిన నిష్ణాతులైన ప్లాస్టిక్‌ సర్జరీ వైద్యనిపుణులు వైద్యులు, వైద్యవిద్యార్థులకు నాణ్యమైన వైద్యచికిత్స విధానంపై వివరించారు. సదస్సు అబ్జర్వర్‌ డాక్టర్‌ పీవీ సుధాకర్‌, జీజీహెచ్‌ డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్‌ ఎంపీఆర్‌ విఠల్‌, డాక్టర్‌ శ్రీనివాసన్‌, ఆర్‌ఎంసీ వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ శశి, ఫోరెన్సిక్‌ హెచ్‌వోడీ డాక్టర్‌ ఉమామహేశ్వరరావు, సర్జరీ విభాగాధిపతి డాక్టర్‌ ఎస్‌.శ్రీనివాస్‌, ఏపీఆర్‌ఏఎస్‌సీఓన్‌ ప్యాట్రన్‌ డాక్టర్‌ కె.విష్ణుమూర్తి, వైస్‌ ప్రెసిడెంట్‌ డాక్టర్‌ ఎస్‌. ప్రవీణ్‌, కార్యదర్శి డాక్టర్‌ రాంబాబు పాల్గొన్నారు.

శస్త్రచికిత్సల స్పెషల్‌ బస్సు...2 రోజులు ఇక్కడే


శస్త్రచికిత్స పరికరాలను పరిశీలిస్తున్న వైద్యనిపుణులు

ప్రాథమిక శస్త్ర చికిత్స అంశాలపై వైద్యులు, వైద్యవిద్యార్థులకు శిక్షణను ఇచ్చేందుకు అత్యాధునిక వసతులతో కూడిన ప్రత్యేక బస్సు శుక్రవారం కాకినాడ రంగరాయ కళాశాల(ఆర్‌ఎంసీ)కు వచ్చింది. జీజీహెచ్‌, ఆర్‌ఎంసీల్లో వైద్యవిద్యను బోధిస్తున్న వైద్య నిపుణుల పర్యవేక్షణలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌ విద్యార్థులకు, హౌస్‌సర్జన్‌లకు ఈ బస్సులో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ ఆధునిక బస్సులో రకరకాల కుట్లకు సంబంధించిన శిక్షణ, లాపరోస్కోపిక్‌ ఆపరేషన్లకు సంబంధించిన శిక్షణ, ముఖ్యంగా పేగుల ఆపరేషన్‌లో ఉపయోగించే స్టాప్లర్‌లు అనే ప్రత్యేక పరికరాలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఎస్‌.లావణ్యకుమారి, ఆర్‌ఎంసీ వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ శశి ప్రారంభించారు. శుక్ర, శనివారాల్లో ఈ బస్సు ఆర్‌ఎంసీ ప్రాంగణంలో ఉండనున్నట్టు సూపరింటెండెంట్‌ తెలిపారు. సాధారణ, లాపరోస్కోపిక్‌, గైనకాలజీ, యూరాలజీ, పిడియాట్రిక్‌ సర్జరీల వైద్యులు, వైద్య విద్యార్థులకు శిక్షణ ఇస్తారని చెప్పారు.

కోతులు కూల్చిన ఇల్లు

భూకంపధాటికి బీటలువారిన రావి చెట్టు కొమ్మలు


కోతుల కారణంగా కూలిపోయిన ఇల్లు

కూనవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరంలో బల్లా ఉమాదుర్గకు చెందిన ఇల్లు శుక్రవారం తెల్లవారుజామున వానరుల దండు కారణంగా కుప్పకూలింది. 2రోజుల క్రితం కూనవరంలో స్వల్పంగా భూకంపం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ భూకంపందాటికి కూనవరం పంచాయతీ దగ్గరలో ఉన్న ఓ భారీ రావిచెట్టు కొమ్మ బీటలు వారింది. సగం వరకు బీటలు వారడంతో అప్పటికే ఆ రావి చెట్టు కొమ్మ కిందపడిపోయే స్థాయిలో ఉంది. దీంతో శుక్రవారం తెల్లవారుజామున ఒక్కసారిగా వానరుల దండు ఆ రావిచెట్టు కొమ్మపై ఊగిసలాడడంతో వాటి బరువుకు ఆ కొమ్మ కిందపడిపోయింది. కొమ్మ కింద ఉమాదేవి ఇల్లు ఉండడంతో రేకులు, గోడలు కుప్పకూలిపోయాయి. ఉమాదేవి కుటుంబం ఆసుపత్రికివెళ్లడంతో ప్రమాదం తప్పింది.

కృష్ణా జిల్లాకు...
క్యూ కట్టిన లారీలు

వెయ్యిమెట్రిక్‌ టన్నుల ధాన్యం లోడింగ్‌ చేసుకుని కాకినాడ జిల్లాకు నేడు రాక

కలెక్టరేట్‌(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా నుంచి 45 లారీలు శుక్రవారం కృష్ణా జిల్లాకు బయలుదేరి వెళ్లాయి. అక్కడి నుంచి వెయ్యి మెట్రిక్‌ టన్నుల ధాన్యం లోడింగ్‌ చేసుకుని శనివారం కాకినాడకు చేరుకోనున్నాయి. కృష్ణా జిల్లాలో ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న ధాన్యం సేకరణకు మంచి స్పందన లభించింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వేల మెట్రిక్‌ టన్నుల ధాన్యం వచ్చి చేరుతుంది. దీంతో అక్కడ నిల్వ చేయడం కష్ట సాధ్యంగా మారింది. దీంతో కృష్ణాజిల్లాలో సేకరించిన ధాన్యాన్ని కాకినాడ జిల్లాకు తరలించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ధాన్యం తరలింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని కాకినాడ అధికారులకు ఆదేశించారు. దీంతో కాకినాడ కలెక్టర్‌ షాన్‌మోహన్‌, జేసీ రాహుల్‌మీనా, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్‌ దేవుల నాయక్‌, ఆర్డీవో మల్లిబాబుల ఆధ్వర్యంలో ధాన్యం తీసుకొచ్చేందుకు జిల్లాలో మిల్లర్లకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు మిల్లర్లు 45 లారీలను కృష్ణాజిల్లాకు పంపించారు. ఒక్కొక లారీలో 20మెట్రిక్‌ టన్నుల వరకు ధాన్యం లోడింగ్‌ చేసుకుని శనివారం కాకినాడకు రానున్నాయి. ఈ ధాన్యం కాకినాడ జిల్లాలో వివిధ సీఎంఆర్‌ మిల్లుల్లో మిల్లింగ్‌ చేసుకుని బియ్యంను జిల్లాలో పౌరసరఫరాల సంస్థ గొడౌన్లలో నిల్వ చేస్తారు. మరో 2 రోజుల పాటు జిల్లానుంచి లారీలు కృష్ణా జిల్లాకు పయనం కానున్నారు.

టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడిపై బీరు బాటిల్‌తో దాడి


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీర్రాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజుపై గుర్తు తెలియని దుండగుడు బీరు బాటిల్‌తో దాడిచేసి పరారైన సంఘటన గురువారం రాత్రి రాయవరం మండలం చెల్లూరులో జరిగింది. టీడీపీ నేతలు తెలిపిన వివరాల ప్రకారం... పుష్ప-2 సినిమా రిలీజ్‌ సందర్భంగా గ్రామానికి చెందిన కొందరు వైసీపీ సానుభూతిపరులు పుష్ప-2 సినీ నటులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ ఫొటోతో కూడిన రెండు ఫ్లెక్సీలను గ్రామంలో ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ అమల్లో ఉన్నందున రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను ఎలా ఏర్పాటు చేస్తారని టీడీపీ నాయకుడు బవిరిశెట్టి అప్పారావు గ్రామ కార్యదర్శికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసుల సహకారంతో ఫ్లెక్సీలను తొలగించేందుకు అధికారులు, పోలీసు సిబ్బందితో వెళ్లారు. ఒక ఫ్లెక్సీ తొలగించడంతో రెండో ఫ్లెక్సీని తొలగించకపోవడంతో మరోసారి అధికారులు ఫ్లెక్సీ తొలగించేందుకు వెళ్లారు. పంచాయతీ గేటుకు సమీపంలో కూటమి నేతలతో మాట్లాడి బయటకు వెళ్తున్న గ్రామశాఖ అధ్యక్షుడి వీర్రాజుపై వెనుక నుంచి బీరు బాటిల్‌తో దాడి చేసి దుండగుడు తీవ్రంగా గాయపరిచాడు. వెంటనే సమీపంలో కూటమి నేతలు వీర్రాజు వద్దకు వచ్చేసరికి దూరంగా పక్క వీధిలో ఉన్న మరో వ్యక్తి బైక్‌పై దుండగుడు పరారయ్యాడు. రాయవరం ఎస్‌ఐ బుజ్జిబాబుకు విషయం తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకుని దాడి సంఘటనపై ఆరా తీశారు. వీర్రాజును రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి కూటమి నేతలు తరలించారు. ఈ సంఘటనపై ఏరియా ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్‌ఐ బుజ్జిబాబు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజును రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

‘అస్సాగో ఇథనాల్‌ పరిశ్రమను వెంటనే సీజ్‌ చేయాలి’



రంపయర్రంపాలెంలో నిరసన తెలుపుతున్న రైతు కూలీ సంఘం సభ్యులు

గోకవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో ఏర్పాటుచేసిన అస్సాగో ఇథనాల్‌ పరిశ్రమ అనుమతులు రద్దు చేసి, వెంటనే సీజ్‌ చేయాలని డిమాండ్‌ చేస్తూ రంపయర్రంపాలెంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నా కుల వీరాంజనేయులు మాట్లాడుతూ పరిశ్రమ వల్ల వెలువడయ్యే విష వాయువుల వల్ల సమీపంలో ఉన్న గుమ్మళ్ళదొడ్డి, అచ్యుతాపురం, బావాజీపేట, వెదురుపాక గ్రామాల ప్రజలు అనారోగ్యం పాలవుతూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితుల్లో ఉన్నారని.. ఈ విషయంలో ప్రభుత్వం, అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారని విమర్శించారు. పరిశ్రమకు సీజ్‌ చేయాలని లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సతీష్‌, నాయకులున్నారు.

పరిశ్రమకు వ్యతిరేకంగా పోస్టర్లు

గుమ్మళ్ళదొడ్డిలో ఇథనాల్‌ పరిశ్రమకు వ్యతిరేకంగా శుక్రవారం గోడలపై పోస్టర్లు వెలిశాయి. పోలీసులు పంచాయితీ అధికారుల సహకారంతో వాటిని తొలగించారు. 144 సెక్షన్‌ అమల్లో ఉన్నందున ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టరాదంటూ హెచ్చరికలు జారీ చేశారు.

జీజీహెచ్‌ మేనేజర్‌ సస్పెండ్‌కు సిఫార్సు చేసిన కలెక్టర్‌

కలెక్టరేట్‌(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌ మేనేజర్‌ నరసింగరావును సస్పెండ్‌ చేయాలని కోరుతూ కాకినాడ జిల్లా కలెక్టర్‌ షాన్‌మోహన్‌ శుక్రవారం ఒక నివేదికను వైద్యఆరోగ్యశాఖ రీజనల్‌ డైరెక్టర్‌కు పంపించారు. 2020-21లో కొవిడ్‌ సమయంలో నర్సుల పోస్టుల నియామకాల్లో మెరిట్‌ను పాటించకుండా పోస్టులు నింపారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆస్పత్రిలో 278 నర్సుల పోస్టుల భర్తీలో పలువురు అనర్హులకు పోస్టింగులు ఇచ్చిన నేపథ్యంలో రాజమహేంద్రవరానికి చెందిన రాజీవ్‌వర్మ ఇచ్చిన ఫిర్యాదుతో అక్టోబరు 24న విచారణ కమిటీని నియమించారు. ఈ వ్యవహారంపై విచారణ పూర్తిచేసిన కమిటీ తమ నివేదికను గతనెల 7న కలెక్టర్‌ షాన్‌మోహన్‌కు అందజేశారు. అవకతవకలు నిర్ధారణ కావడంతో గతనెల 26న జీజీహెచ్‌ మేనేజర్‌కు మెమో జారీ చేశారు. అక్రమాలు నిర్ధారణ అయిన నేపథ్యంలో చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని కోరారు. మేనేజర్‌ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో కలెక్టర్‌ శుక్రవారం అతడ్ని సస్పెండ్‌ చేయాలని సిఫార్సు చేశారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్‌

ముమ్మిడివరం/పి.గన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్‌ బీఆర్‌ అంబేడర్‌ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగుల్లంక మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలలో సెకండ్‌ గ్రేడ్‌ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పిండి శ్రీనివాస్‌ను సస్పెండ్‌ చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి షేక్‌ సలీంబాషా తెలిపారు. పాఠశాలలో 3,4,5 తరగతులకు సంబంధించి ఆరుగురు విద్యార్థులపై అతడి లైంగిక వేధింపులపై ఈనెల 4వ తేదీన ఎంఈవో-1,2 కె.హెలీనా, సీహెచ్‌ వీరభద్రనందం విచారణ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు, బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూలు మేనేజ్‌మెంట్‌ సభ్యులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, వివరాలు సేకరించారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ లైంగిక వేధింపులకు పాల్పడినట్టు నిర్ధారించుకుని ఎంఈవో కె.హెలీనా నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ప్రకారం ఆ ఉపాధ్యాయుడిని 4వ తేదీ నుంచి విధుల నుంచి సస్పెండ్‌ చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి షేక్‌ సలీంబాషా పేర్కొన్నారు. అలాగే ఆ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదైందన్నారు.

వీరేశ్వరుని హుండీ ఆదాయం రూ.31 లక్షలు

ఐ.పోలవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ వీరేశ్వర స్వామి హుండీల ఆదాయం 280రోజులకు రూ.31,01,405 వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్‌ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. రాజోలు కార్యనిర్వహణాధికారి ఎం.ప్రసాదరాజు పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది. ప్రధాన హుండీ ద్వారా రూ.16,78,974, నిత్యకల్యాణం హుండీ ద్వారా రూ.12,25,944, వీరేశ్వరఅన్నదాన ట్రస్టు ద్వారా రూ.1,96,487 సమకూరినట్టు తెలిపారు. 48గ్రాముల బంగారం, 290గ్రాముల వెండి, 2 విదేశీ డాలర్లు వచ్చినట్టు తెలిపారు. ఆదాయాన్ని మురమళ్ళ బ్యాంక్‌ ఆఫ్‌ బరోడాలో డిపాజిట్‌ చేశామన్నారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్‌ కటారి నాని, దాట్ల ఇంద్రరాజు పాల్గొన్నారు.

విద్యుత్‌ ఉచ్చులో పడి 6 ఆవులు, 2 ఎద్దులు మృతి

అడ్డతీగల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అడ్డతీగల మండలం అనిగేరు సమీపంలో అటవీ ప్రాంతంలో దుండగులు అడవి జంతువుల వేట కోసం అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్‌ ఉచ్చులో పడి ఒకే రైతుకు చెందిన 6 ఆవులు, 2 ఎద్దులు మృతి చెందాయి. అనిగేరు గ్రామానికి చెందిన ముర్ల అబ్బాయిరెడ్డికి చెందిన మొత్తం పశువులు ఈ ఘటనలో మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర ఆవేదన చెందుతోంది. దీనిపై బాధితుడు శుక్రవారం అడ్డతీగల పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


మృతిచెందిన మూగ జీవాలు

రైస్ గిడ్డంగులను పరిశీలించిన ఎమ్మెల్యే

అంతర్వేది, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి ఎస్‌డబ్ల్యుసీ సివిల్ సప్లయి గోదాము వద్ద మిల్లింగ్ రైస్‌ను గిడ్డంగుల్లో భద్రపరిచే విధానాన్ని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. తర్వాత గోడౌన్లు, రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు (పెద్దకాపు) పాల్గొన్నారు.

నేడు కర్మచారి కమిషన్ చైర్మన్ రాక

అమలాపురం టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేశన్ శనివారం అమలాపురం రానున్నారు. స్థానిక కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో మధ్యాహ్నం 12గంటలకు ఆయన సమావేశమవుతారు. జిల్లాలో పనిచేస్తున్న సఫాయి కర్మచారుల క్షేత్రస్థాయి స్థితిగతులపై సమీక్షిస్తారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం





అమలాపురం: ఎ.వేమవరంలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం, ముమ్మిడివరంలో స్వామివారి కల్యాణం, రాజోలు: కడలిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

అమలాపురం రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి నొందిన ఎ.వేమవరం శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం రాత్రి భక్తుల సమక్షంలో వైభవంగా స్వామివారి కల్యాణం జరిపించారు. గూడ హరిశ్చంద్రుడు వంశీకులు స్వామివారి కల్యాణం జరిపించారు. తొలుత నెమలి వాహనంపై స్వామి-అమ్మవార్లను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం చంద్రమౌళీ సురేష్‌శర్మ ఆచార్య బ్రహ్మత్వంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారి దివ్య కల్యాణం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయం వద్ద ప్రత్యేకంగా విద్యుత్ దీపాలంకరణ చేశారు. 42అడుగుల ఎత్తులోఉన్న సుబ్రహ్మణ్యేశ్వరుని విగ్రహం విద్యుత్‌కాంతులతో ఆకట్టుకుంది.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): శ్రీవల్లీదేవసేన సమేత సుబహ్మణ్యేశ్వరస్వామివారి షష్ఠి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి అత్యంత ప్రీతికరమైన కావిడి పూజా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పాలకావిడి, తేనె కావిడి, భస్మకావిడి, సర్పకావిడిలను కేరళ డప్పు వాయిద్యాలతో స్వామివారి నామస్మరణతో భుజాన వేసుకుని గ్రామ ప్రదక్షిణ నిర్వహించి స్వామివారికి సమర్పించారు. ఆలయ అర్చకుడు కొండవీటి రాంబాబుశర్మ, ఆదిత్యశర్మ మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి కావిడిలు సమర్పించి విశేష పూజలు జరిపించారు. కార్యక్రమంలో జంధ్యాల శివకుమార్, దివి విజయ్, పెన్మెత్స చిట్టిరాజు, పెన్మెత్స సీతారాముడు, వి.చిన్నారావు, కాజులూరి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం: అర్చకులు కొండవీటి రాంబాబుశర్మ, ఆదిత్యశర్మల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి స్వామి-అమ్మవార్లకు కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. తొలుత స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించి అనంతరం కల్యాణం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు.

ఐ.పోలవరం,(ఆంధ్రజ్యోతి): మురమళ్లలో వీరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి శ్రీవల్లీదేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ పురోహితుడు నాగభట్ల రామకృష్ణమూర్తి దంపతులు స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం జరిగింది.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): మాచవరంలో వేంచేసియున్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి దివ్యకల్యాణాన్ని శుక్రవారం రాత్రి ఆలయ అర్చకులు మాచరి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈపూజల్లో ఆలయ ధర్మకర్త గోకవరపు సత్యనారాయణమూర్తి, చినబాబు, సాయి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సోమవారం షష్ఠి సందర్భంగా స్వామి దర్శనానికి అన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పుల్లేటికుర్రులో వేంచేసియున్న సుబ్రహ్మణేశ్వరస్వామి కల్యాణాన్ని సర్వేజన సుఖినో భవంతు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇరుసుమండ, వాకలగరువు, మాచవరం కోఠివారి అగ్రహారం, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల్లో ఉన్న శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారి కల్యాణాన్ని ఆయాగ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): శ్రీవల్లీదేవసేనసమేతసుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. సన్నవిల్లిలో భైరవబొట్ల కుమార్ ఆధ్వర్యంలో పుల్లేటికుర్తి గౌరీశంకర్ బ్రహ్మత్వంలో బద్రి శ్రీనివాసరావు, సూర్యకుమారి దంపతుల నిర్వహణలో కల్యాణం నిర్వహించారు. మాజీ సర్పంచ్ బద్రి సూర్యనారాయణ కుమారుల ధనసహాయంతో అన్నసమారాధన జరిగింది. గొల్లవిల్లిలో ఉప్పలపాటి గణేష్ దంపతుల నిర్వహణలో భైరవబొట్ల వెంకటసుబ్రహ్మణ్యం(నాని) ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణం జరిగింది.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): కడలిలో శ్రీకపోతేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం అర్చకుడు కాకినా వెంకటసత్యకృష్ణకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారంరాత్రి 7.01గంటలకు వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.కల్యాణోత్సవానికి అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి..

శనివారం జరిగే షష్ఠి ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు పూర్తిచేశామని ఆలయ ఈవో ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు సర్వవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆదివారం రాత్రి 7.01 గంటలకు స్వామివారి పవళింపు సేవ నిర్వహిస్తామన్నారు.

హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య బీమా సదుపాయం



కలెక్టరేట్‌లో ఐసీఐసీఐ లాంబార్డ్ ఆరోగ్య బీమా ప్రతినిధులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ప్రభుత్వ వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింప చేసేందుకు అన్నిచర్యలు పూర్తి కావచ్చినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని సాంఘిక, వెనుకబడిన తరగతులు, రెసిడెన్షియల్ పాఠశాలలు, చైల్డ్‌కేర్ సెంటర్లలో ఉన్న 8,383 మంది విద్యార్థులకు ఐసీఐసీఐ లాంబార్డ్ ఆరోగ్య బీమా వర్తింప చేస్తున్నామన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆరోగ్య బీమా ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులకు అత్యవసర వైద్య సేవలు అందిస్తామన్నారు. అంబులెన్సు రవాణా సేవలు కూడా అందించేందుకు బీమా సంస్థ ముందుకు వచ్చిందన్నారు. ఆసుపత్రుల్లో నగదు రహిత సేవలు అందించేందుకు ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సమీపంలోని ఆసుపత్రుల ఫోన్ నంబర్లు, అంబులెన్సు ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వసతిగృహ సంక్షేమ అధికారులకు, విద్యార్థులకు ఎలక్ట్రానిక్ గుర్తింపు కార్డులు జారీకి చర్యలు చేపట్టాలని బ్యాంకర్లకు సూచించారు. ఆ గుర్తింపు కార్డును చూపించి నగదు రహిత వైద్యసేవలు పొందవచ్చునన్నారు. బీమాసంస్థ ప్రతినిధులుఎస్.శ్రీనివాసరావు, శ్రవణ్, వెంకటేశ్వరరావు, ఐసీఐసీఐ బ్యాంకు మేనేజర్ చల్లా శ్రీను పాల్గొన్నారు.

పంట నష్టాల నమోదు

కాట్రేనికోన, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తుపానుకు దెబ్బతిన్న పంట నష్టాల నమోదుకు ఆదేశాలు వచ్చినట్టు ఏవో కె.ప్రవీణ్ తెలిపారు. 33శాతం కంటే ఎక్కువ దెబ్బతిన్న పొలాల వివరాలను ఈనెల12నవ్యవసాయ సహాయకులు నమోదుచేస్తారని, ఈనెల14నుంచి 21వరకు ఈవివరాలను సామాజిక తనిఖీ నిమిత్తం రైతుసేవాకేంద్రాల వద్ద ఉంచుతామన్నారు. 23న కలెక్టర్‌కు పంపిస్తామన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

అమలాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో శుక్రవారం జిల్లాస్థాయి నోడల్ అధికారులు పీజీఆర్ఎస్ నోడల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీల స్థితిగతులపై ఆరా తీశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు పనితీరు మెరుగుపరుచుకుని రోజువారీగా వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు లాగిన్ ద్వారా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముందుగా అర్జీదారునికి ఫోన్‌చేసి క్షేత్రస్థాయిలో విచారణకు వెళ్లాలని సూచించారు. నాణ్యమైన పరిష్కార మార్గాలు చూపుతూ డిస్పోజల్ పత్రంపై అర్జీదారుని సంతకం తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు తమ పరిధిలోకి వచ్చిన అర్జీలలో ఐదు అర్జీలను స్వయంగా విచారించి పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.మదన్మోహనరావు, అధికారులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి




ముమ్మిడివరం టీడీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు, పి.గన్నవరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

ముమ్మిడివరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు అధ్యక్షతన జరిగిన అంబేడ్కర్ 68వ వర్ధంతి కార్యక్రమంలో బుచ్చిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, మాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చెల్లి అశోక్, నాయకులు గొలకోటి దొరబాబు, తాడి నరింహారావు, తాడి జానకీరామ్, దొమ్మేటి రమణకుమార్, గొల్లపల్లి గోపి, దాట్ల బాబు, నడింపల్లి శ్రీనివాసరావు, సాగిరాజు సూరిబాబురాజు, సలాది నానాజీ, తాడి జానకీరామ్, యాళ్ల ఉదయ్, మెండి కమల, పాయసం చిన్నీ, కాశి లాజర్, కుడుపూడి మల్లేశ్వరి, చింతకింద కృష్ణ, బూరుగు కల్యాణ్, నీతిపూడి వంశీ, తొత్తరమూడి జ్యోతిబాబుపాల్గొన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలోకమిషనర్ పి.రవివర్మ అధ్యక్షతన జరిగిన వర్ధంతి కార్యక్రమంలో పలువురు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

అమలాపురం టౌన్/రూరల్, (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాజ్యాంగాన్ని రచించారని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఎం రుషి పేర్కొన్నారు. ఆర్పీఐ జిల్లాశాఖ అధ్యక్షుడు గిడ్డి జ్ఞానప్రకాష్ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిలో భాగంగా ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ స్థాపిన ఆర్పీఐ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతిన బూనారు. కార్యక్రమంలో బళ్ల సత్యనారాయణ, దడాల రామకృష్ణ, బడుగు సత్యనారాయణ, బండి కులకర్ణ పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం ఆర్టీసీ డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో డిపో మేనేజర్ సీహెచ్ఎస్ఎన్ మూర్తి, అసిస్టెంట్ మేనేజర్ ప్రతిమాకుమారి, డిపో కార్యదర్శి దొరబాబు, అధ్యక్షుడు దుర్గారావు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, మహబూబ్ షకీల, నిమ్మకాయల ప్రసాద్, వస్కా బాబు, పులుసుగంటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు నివాళులర్పించారు. బుద్ధవిహార్ చైర్మన్ నాగాబత్తుల ప్రసాదరావు, కాశి రాంబోధి, ములపర్తి సత్యనారాయణ, ఎంఏకే భీమారావు, ఉండ్రు శ్యామలరావు తదితరులు పాల్గొని రాజ్యాంగ ప్రతులను పంపిణీ చేశారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): బి.సావరం సిద్ధార్థ నగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు జగడం సత్యనారాయణ ఆధ్వర్యంలో తాటిపాక సెంటర్‌లో దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో పొదలాడలో జేపీసీ మండల ప్రధాన కార్యదర్శి లిఖితపూడి బుజ్జి ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పూలమాలలువేసి నివాళులర్పించారు. కోరుకొండ ప్రసన్నకుమార్, జాలెం భాస్కరరావు, ఉచ్చుల వెంకట్రావు, బొంతు మణిరాజు, బొడ్డపల్లి పుల్లయ్య, చిలకపాటి శ్రీధర్, మట్టా సురేష్‌కుమార్, గొల్లపల్లి శివ పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): యువత అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం మలికిపురం పూలే-అంబేడ్కర్‌భవన్‌లో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్, బహుజన సమాఖ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి జరిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాదరావు, గొల్లపల్లి సూర్యారావు, గుండుబోగుల పెద్దకాపు, గెడ్డం తులసీభాస్కర్, బత్తుల లక్ష్మణరావు, గుబ్బల బాబ్జి, నల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, నేతలు పూలమాలలువేసి నివాళులర్పించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పూలమాలలువేసి నివాళులర్పించారు. అలాగే ఎంపీడీవో జీవీ సరోవర్, ఉద్యోగులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. పుల్లేటికుర్రులో సర్పంచ్ జల్లి బాలరాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందిన అంబేడ్కర్ అందరికీ ఆదర్శనీయుడని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు మామిడికుదురు బస్టాండు కూడలిలో గల ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, జనసేన అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, బోనం బాబు, అడబాల తాతకాపు, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, కంకిపాటి నరసింహారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ మహనీయుడని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కొనియాడారు. పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కేవీ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, స్థానిక నాయకులు, సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, సర్పంచ్ బొండాడ నాగమణి, వైస్ ఎంపీపీ చెల్లిబోయిన గంగాదేవి, కోట రామ్మోహనరావు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, సంసాని పెద్దిరాజు, కోట విజయభాస్కర్, అడ్డగళ్ల వెంకటసాయిరాం, యడ్ల ఏసు, అన్నాబత్తుల హనుమాన్, తాటికాయల శ్రీనివాసరావు, సాధనాల రమేష్ పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం సమతా కల్యాణ మండపం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పూలమాలలువేసి నివాళులర్పించారు. సఖినేటిపల్లి మండలంలో వాడవాడలా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, గుబ్బల ఫణికుమార్, ముప్పర్తి నాని, ఎంపీపీ వీరా మల్లిబాబు, పినిశెట్టి బుజ్జి, తాడి మోహన్‌కుమార్, తాడి సత్యనారాయణ, దళిత నాయకులు పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): మొగళ్లమూరిలో పరిధిలో మాజీ ఎంపీ చింతా అనురాధ, గోడిలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. గోడిలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు రాజు, సర్పంచ్ తోట శ్రీదేవి, బోడసకుర్రులో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, అల్లవరం మండల పరిషత్ వద్ద ప్రత్యేకాధికారి కర్నీడి మూర్తి, ఎంపీడీవో డీఎస్ఎస్ కృష్ణమోహన్ అంబేడ్కర్ విగ్రహాలు,చిత్రపటాలకు నివాళులర్పించారు.

సంకల్ప బలంతో విజయం

ముమ్మిడివరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంకల్ప బలంతో అంగ వైకల్యాన్ని జయించవచ్చునని ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా పేర్కొన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ముమ్మిడివరంలోని భవిత కేంద్రం సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో ఎంఈవో బొజ్జా రమణశ్రీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రహ్మతుల్లా మాట్లాడారు.

వెండి కిరీటాలు బహూకరణ



కాట్రేనికోన, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): నడవపల్లి శ్రీవల్లీదేవసేనసమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కాట్రేనికోనకు చెందిన గ్రంధి నారాయణ మూర్తి, సత్యవతి దంపతులు రూ.లక్ష విలువైన రెండు వెండి కిరీటాలను బహూకరించారు. శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకుడు భైరవబొట్ల బ్రహ్మజీ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం వెండి కిరీటాలను అలంకరించారు. అనంతరం స్వామికి కల్యాణం నిర్వహించారు. బంగారు కిశోర్, గిరిజ, గ్రంధి వెంకటసత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యుని కల్యాణం

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): బోడసకుర్రు వైనతేయ నదీ తీరాన సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో శుక్రవారం రాత్రి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం వేడుకగా జరిగింది. బావిశెట్టి లక్ష్మణకుమార్-రోజా దంపతులు శ్రీకంఠం కామేశ్వరశర్మ స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలకు పల్లకీలో గ్రామోత్సవం జరిపారు. కలిగినీడి ఉదయభాస్కరరావు, బావిశెట్టి భీమేశ్వరరావు, మొయిల గణపతి, అయిల నాగేశ్వరరావు, నవీన్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో విద్యార్థులకు స్పోర్ట్స్ మీట్
త్వరలో మండల, డివిజన్ స్థాయి పోటీలకు ఏర్పాట్లు

అమలాపురం టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో తొలి దశలో విద్యార్థులకు స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. రెండో దశలో వివిధ శాఖల ఉద్యోగులకు జిల్లాస్థాయిలో స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తామన్నారు. స్పోర్ట్స్‌మీట్ నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ, స్కూలుగేమ్స్ ఫెడరేషన్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. జిల్లాస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా విద్యార్థులకు రెండు విభాగాలుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. 4,5,6 తరగతుల విద్యార్థినీ విద్యార్థులను మొదటి కేటగిరిగా గుర్తించి మండలస్థాయిలో ఫైనల్ పోటీలు పూర్తిచేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, పతకాలు, ప్రశంసా పత్రాలు బహూకరించాలన్నారు. రెండో కేటగిరీలో 7,8,9 తరగతుల విద్యార్థులకు డివిజన్‌స్థాయి పోటీలు నిర్వహించి విజేతలను జిల్లాస్థాయి పోటీలకు పంపించాలని కలెక్టర్ సూచించారు. క్రీడాపోటీలకు అవసరమైన క్రీడాసామగ్రి కిట్లు, క్రీడాదుస్తులు, బూట్లు, అల్పాహారం, భోజన వసతుల కల్పన, పతకాలు, ప్రశంసాపత్రాలు, బహుమతలకయ్యే ఖర్చుల అంచనాలను రూపొందించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, త్రోబాల్, కోకో, బాస్కట్ బాల్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఒక్కో రెవెన్యూ డివిజన్‌కు మూడు టీముల చొప్పున జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లకు 9టీములను ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా, తోట రవి, ఐ.భీమేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాలకు క్విజ్ దోహదం

అమలాపురం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో రాణించేందుకు, విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు క్విజ్ పోటీలు దోహదపడతాయని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచి పోటీతత్వాన్ని అలవరిచేందుకు, సృజనాత్మక విజ్ఞానాన్ని, వ్యక్తిత్వ వికాశాన్ని పెంపొందించేందుకు రిలయన్స్ ధీరూభాయ్ అంబాజీ క్విజ్ పోటీలు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. శుక్రవారం అమలాపురం అంబేడ్కర్ భవన్‌లో రిలయన్స్ క్విజ్ పోటీలను జేసీ నిషాంతి జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ధీరూభాయ్ అంబానీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఏటా క్విజ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు భవిష్యత్తులో పోటీ పరీక్షలను ధైర్యంగా రాసేందుకు క్విజ్ పోటీలు దోహదపడతాయన్నారు.కోనసీమ పరిధిలోని 8,9,10 తరగతుల విద్యార్థులకు ఈపోటీలు నిర్వహించారు. జిల్లాలోని 120ఉన్నత పాఠశాలల నుంచి 480మంది విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. క్విజ్ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో, ప్రైవేటు పాఠశాలల విభాగంలో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో క్విజ్‌మాస్టర్ ఏజీకే మూర్తి, రిలయన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి మాతృ వియోగం



ఉప్పలగుప్తం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): చల్లపల్లికి చెందిన సీనియర్ తెలుగుదేశం నాయకుడు దంగేటి రవీంద్రనాథ్ తల్లి శేషహనుమంతలక్ష్మి(83) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆమె మృతికి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, సర్పంచ్ ఇసుకపట్ల జయమణిరఘుబాబు, ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు సంతాపం తెలిపారు.పలువురు కూటమి నాయకులు రవీంద్రనాథ్‌ను పరామర్శించి సానుభూతి తెలిపారు.

డీఎంహెచ్‌వో కార్యాలయ ఉద్యోగుల అవినీతి ఆరోపణలపై విచారణ

ముమ్మిడివరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉద్యోగులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై శుక్రవారం విచారణ అధికారి మరోసారి విచారణ నిర్వహించారు. లీవ్‌ల మంజూరు, మెటర్నటీ లీవ్‌లు, సరెండర్ లీవ్‌లు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ విషయాల్లో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎల్.శ్రీధర్, మరికొంతమంది సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్టు వైద్యులు, వైద్య సిబ్బంది ఆరోపించిన విషయం విదితమే. శుక్రవారం విచారణకు 25మంది వైద్యులు హాజరుకావాల్సి ఉండగా 21మంది హాజరయ్యారు. ఆ వైద్యులు లిఖిత పూర్వకంగా ఇచ్చిన ఆరోపణలపై విచారణాధికారి విచారణ నిర్వహించారు. ఆరోపణ పత్రాల్లోని కొన్ని అంశాలను పొందుపరిచి వాటికి మరలా లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వాలని వైద్యులను కోరారు శనివారం మిగిలిన నలుగురు వైద్యులను, 22మంది వైద్య సిబ్బందిని విచారించి ఫిర్యాదులపై లిఖిత పూర్వకమైన వివరణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా విచారణాధికారి సత్యనారాయణ మాట్లాడుతూ ఆరోపణలపై కొన్ని ప్రశ్నలకు ఫిర్యాదుదారుల నుంచి లిఖిత పూర్వకంగా వివరణ తీసుకున్నామని, వివరణ పూర్తయిన తరువాత నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. విచారణ అనంతరం బయటికి వచ్చిన వైద్యులు స్థానిక మీడియాతో మాట్లాడారు. విచారణలో వాస్తవాలు వెలుగు చూస్తాయనే నమ్మకం లేదని, విచారణ పూర్తిస్థాయిలో జరగడం లేదన్నారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి

ఐ.పోలవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విజయవాడలో వచ్చే ఏడాది జనవరి 5న జరిగే హైందవ శంఖారావం కార్యక్రమానికి లక్షలాదిగా హిందువులు పాల్గొని విజయవంతం చేయాలని విశ్వహిందూపరిషత్ ప్రాంత సత్సంగ ప్రముఖ్ రాళ్ళపల్లి పాపయ్యశర్మ పిలుపునిచ్చారు. మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో శుక్రవారం సంఘ మండలి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన సమావేశం జరిగింది. హైందవ శంఖారావం ద్వారా హిందూ దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనం తగ్గాలని, రాజకీయ ప్రమేయం ఉండరాదని, దేవాలయాల్లో హిందువులకే బాధ్యతలు అప్పగించాలన్న డిమాండ్లను ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. సమావేశంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సంయోజక్ తలారి శ్రీనివాసరావు, సబ్ డివిజన్ ప్రచారక్ బొంతు కనకారావు, ఏలూరి రాంబాబు, నంద్యాల నరసింహస్వామి, కేదారశెట్టి శ్రీనివాసరావు, పేరాబత్తుల రామకృష్ణారావు, పెన్మెత్స కృష్ణంరాజు, చప్పిడి దానేశ్వరరావు, పితాని శ్రీనివాసరావు, నూలు వల్లీతాయారు, పెమ్మిరెడ్డి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

చలో గుంటూరు కరపత్రం ఆవిష్కరణ

అయినవిల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరం సెంటర్‌లో జిల్లా మాలమహానాడు జేఏసీ కమిటీ సమక్షంలో చలో గుంటూరు కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. మాలమహానాడు మండల అధ్యక్షుడు గిడ్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జల్లి శ్రీనివాసరావు, నాతి శ్రీనివాసరావు, బొంతు రమణ, మెండి డేవిడ్‌లు హాజరై డిసెంబరు 15న గుంటూరులో జరిగే మాలల మహాగర్జన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు భయ్యా చిన్నబాబు, మద్దా చంటిబాబు, పెట్ట జగన్, నరళ్ల సత్యనారాయణ, గుత్రాల రాంబాబు, యడ్ల కిరణ్ బాబు, ములిదిండి సత్యనారాయణ, దాసరి వీరాస్వామి పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలను కలిసిన నామన

మామిడికుదురు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును జడ్పీ మాజీ చైర్మన్ నామాన రాంబాబు విజయవాడలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. శ్రీశైలం ప్రసాదం ఆయనకు అందించి పలు సమస్యలపై మాట్లాడారు.

కుల గణన చేయాలని నిరసన దీక్ష



మామిడికుదురు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మాలల న్యాయపోరాట సమితి ఆధ్వర్యంలో కులగణన చేయాలంటూ నిరవధిక దీక్షను దళిత సంఘాల నాయకులు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించారు. కులగణన జరిగే వరకు వన్‌మెన్ కమిషనర్ రద్దు చేయాలని, గత ప్రభుత్వం రద్దుచేసిన 27 సంక్షేమ పథకాలను కూటమి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో పునఃప్రారంభిస్తారని చెప్పారని, వాటిని వెంటనే ప్రారంభించాలని గత ప్రభుత్వం హయాంలో 400మంది దళితులపై దాడులు జరిగాయని వాటిపై ఈప్రభుత్వం విచారణ నిర్వహించాలని, క్రిమిలేయర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు పాముల రాజేశ్వరిదేవి, కొండేటి చిట్టిబాబు, నాయకులు బొంతు మణిరాజు, నల్లి శ్రీనివాస్, భూపతి వెంకటపతి, మట్టా సత్తిబాబు, కలిగితి పల్లంరాజు, నెల్లి దుర్గాప్రసాద్, నీతిపూడి మహేష్, దళితసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు న్యాయం చేస్తాం

మలికిపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు చేస్తున్న నిరసన దీక్షా శిబిరాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ సందర్శించారు. త్వరలో మీ సమస్య పరిష్కారమవుతుందని, మా సహకారం మీకు ఎల్లప్పుడూ ఉంటుందని వారిద్దరూ అన్నారు. గెడ్డం తులసీ భాస్కర్, నల్లి శివ, సీహెచ్ సూర్యప్రకాశరావు, పి.ప్రసాద్ ఉన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

మామిడికుదురు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎంపీపీ కె.వనజాకుమారి సూచించారు. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంక్షేమ సంఘం మామిడికుదురు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎంపీపీ శుక్రవారం ప్రారంభించారు. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో జరిగిన శిబిరంలో 25మంది దాతలు రక్తదానం చేశారు. అమలాపురం ఏరియా ఆసుపత్రి వైద్యులు దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఉపసర్పంచ్ కోట బ్రహ్మానందం, ఎంపీడీవో కార్యాలయ ఏవో కారుపల్లి వెంకటేశ్వరరావు, సంఘ అధ్యక్షుడు భూపతి మనోహర్‌రాజు, ప్రధాన కార్యదర్శి కారపల్లి కల్యాణ్‌బాబు, జిల్లా అధ్యక్షుడు బత్తుల నకులరాజు, బత్తుల రమేష్, సాధనాల సత్యనారాయణ, బయ్యా మోహన్, నేల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లేనిపోని వివాదాలు సృష్టించవద్దు

యానాం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తన మాటలు వేరే విధంగా వస్తున్నాయని, లేనిపోని వివాదాలు సృష్టించవద్దని రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జీఎస్ నాయుడు అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధి తనను కలిశారని చెప్పారు. యానాంలో రీజెన్సీ వర్క్స్ కాలనీ సిద్ధమైందని, పట్టాలు పంపిణీ చేయాల్సి ఉందని, అందుకు సహకరించడం గురించి మాత్రమే చర్చించామన్నారు. యానాం అభివృద్ధి, ఉపాధికల్పనే తన ధ్యేయమన్నారు. ఎన్నో సామాజిక సేవలుచేసిన విషయాలు ప్రజలందరికీ తెలుసన్నారు. తాను రాజకీయాలకు అతీతమని జీఎస్ నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

ముమ్మిడివరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ మహిపాలచెరువుకు చెందిన కాళ్లకూరి రాంబాబు ఇంట్లోని పది బస్తాల పీడీఎస్ బియ్యాన్ని ముమ్మిడివరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాంబాబుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు.

వక్ఫ్ బోర్డు సభ్యుడిగా ముఖ్రం హుస్సేన్



మామిడికుదురు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యునిగా నగరం గ్రామానికి చెందిన హాజీ ముఖ్రం హుస్సేన్‌ను నియమించారు. శుక్రవారం ఉత్తర్వులు వెలువడినట్టు హుస్సేన్ తెలిపారు. అబ్దుల్‌అజీజ్ చైర్మన్‌తో పాటు పలువురిని వక్ఫ్‌బోర్డు సభ్యులుగా నియమించారు.

రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

అంతర్వేది, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలపరిషత్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు పనులకు శుక్రవారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. అనంతరం రోడ్ల నిర్మాణంలో రాజీ పడకుండా నిర్మించి పనులువేగంగా చేయాలని ఆదేశించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు (పెద్దకాపు), మండలాధ్యక్షుడు ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, గెడ్డం మహలక్ష్మిప్రసాద్ పాల్గొన్నారు.

వెనుకబడిన ఉప్పలగుప్తం మండలం

ఉప్పలగుప్తం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): హౌస్‌హోల్డ్ సర్వేలో జిల్లాలో ఉప్పలగుప్తం మండలం వెనుకబడిందని జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా నోడల్ అధికారి ఎస్.త్రినాథనాయుడు వ్యాఖ్యానించారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం వెల్ఫేర్‌అసిస్టెంట్లు, 1టూ6గ్రేడ్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సర్వేలో వెనుకబాటుకు నిర్లక్ష్యమే కారణమన్నారు. మార్పు కన్పించకపోతే చర్యలు తప్పవన్నారు.వీఆర్వోలు సహకరించడం లేదని కార్యదర్శులు ఆరోపించారు. ఎంపీడీవో రాజ్‌కుమార్, పాలనాధికారిఎంఎల్ఎన్‌మూర్తి పాల్గొన్నారు.

మండపేట



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న భక్తులు

వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి

ఆత్రేయపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి ఒకరోజు ఆదాయం రూ.2,65,295 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

నేడు కర్మచారి కమిషన్ చైర్మన్ రాక

అమలాపురం టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ ఎం. వెంకటేశన్ శనివారం అమలాపురం రానున్నారు. స్థానిక కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో మధ్యాహ్నం 12గంటలకు ఆయన సమావేశమవుతారు. జిల్లాలో పనిచేస్తున్న సఫాయి కర్మచారుల క్షేత్రస్థాయి స్థితిగతులపై సమీక్షిస్తారు.

అధ్వాన రహదారులతో అవస్థలు

• అధికారుల చోద్యంపై ప్రజల ఆగ్రహం • త్వరితగతిన మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి

ఆత్రేయపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ రహదారులు అధ్వానస్థితికి చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్లపై భారీ వాహనాలు పరుగులు పెట్టడంతో అవి మరింత కుంగిపోతూ భారీ గోతులకు కారణమవుతున్నాయి. అంకంపాలెం నుంచి కట్టుంగ వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారులు మరీ అధ్వానంగా తయారయ్యాయి కట్టుంగ వద్ద ఆర్‌అండ్‌బీ రహదారి కుంగిపోగా, అంకంపాలెం సెంటర్‌లో ఆర్‌అండ్‌బీ రహదారి గోతులుపడి మురుగునీరు చేరుతోంది. చాలా ప్రాంతాల్లో రహదారులు ధ్వంసం కావడంతో రాత్రివేళల్లో వాహనదారులు గోతుల్లోపడి గాయపడిన ఘటనలున్నాయి. ప్రతిరోజూ భారీ వాహనాల రాకపోకలు సాగించడంతో రహదారులు అధ్వాన్నంగా మారాయి. వీటి మరమ్మతులకు నిధులు మంజూరైనా టెండర్ల ప్రక్రియ పూర్తికాకపోవడంతో పనులు ముందుకు సాగడంలేదు. త్వరితగతిన వీటి పనులు పూర్తిచేసి ప్రజల సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కట్టుంగ వద్ద ధ్వంసమైన రోడ్డు



అంకంపాలెంలో ఛిద్రమైన రహదారి

మహిళల సంరక్షణపై అవగాహన

కపిలేశ్వరపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుమూడి ఎంపీపీ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం మహిళల సంరక్షణపై 74 మంది బాలబాలికలకు అవగాహన కల్పించారు. వల్లూరు, వడ్లమూరు మహిళా పోలీసులు ఉదయం 10.40 గంటల నుంచి 11.50 గంటల వరకూ మహిళా సంరక్షణ, తీసుకోవల్సిన జాగ్రత్తలు, అవలంబించాల్సిన పద్ధతులు తదితర అంశాలపై బాలికలకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, మహిళా పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య షష్ఠికి ఏర్పాట్లు పూర్తి



ఆలమూరులోనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

రాయవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో షష్ఠి ఉత్సవాలకు శుక్రవారం అన్ని ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. అష్ట సోమేశ్వరాలయాల్లో ఒకటిగా పేరొందిన మండలంలోని సోమేశ్వరం శివాలయం ప్రాంగణంలో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్య శర్మ, సోమశేఖరశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. వెదురుపాక తుల్యభాగ కాలువ సమీపంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయం పక్కనే ఉన్న పుట్ట వద్ద భక్తులు పూజలు చేయనున్నారు. వెదురుపాక విజయదుర్గా పీఠంలో అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. రాయవరం రాజరాజేశ్వరస్వామి ఆలయం, పసలపూడి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల వద్ద షష్ఠి ఉత్సవాలను పురస్కరించుకుని పూజలు చేసేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి భక్తులు సుబ్బారాయుడ్ని దర్శించుకోనున్న నేపథ్యంలో దర్శనాలకు అన్ని ఏర్పాటు చేస్తున్నారు.

శతాబ్ది చరిత్ర కలిగిన ఆలయం

ఆలమూరు: శతాబ్ది చరిత్ర ఉన్న దేవసేన సమేత సూర్య గోపాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నేడు షష్ఠి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. స్వామివారికి అభిషేకాలు, పూజలు జరిపేందుకు దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తారు.

సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

ఆత్రేయపురం: షష్ఠి వేడుకలకు సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆత్రేయపురం సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వాడపల్లి పురాతన సుబ్రహ్మణ్యస్వామి, పేరవరం సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు షష్ఠి వేడుకలకు ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలతో ఆలయాలను అలంకరించారు. పేరవరం, వాడపల్లి సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో స్వామివారి కల్యాణాన్ని జరిపారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను జరిపారు. స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం పల్లకీ ఉత్సవం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో కల్యాణానికి సిద్ధమైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

కపిలేశ్వరపురం: అంగరలోనున్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కొమాళ్లపల్లి సత్యనారాయణమూర్తి కుమారులు సుబ్రహ్మణ్యం, వెంకట్రావు పర్యవేక్షణలో శ్రీకంఠం మల్లేశ్వరపుశర్మ బ్రహ్మత్వంలో స్వామివారికి సంకల్పం, గ్రామోత్సవం జరిపారు. అనంతరం రాత్రి స్వామివారి కల్యాణాన్ని జరిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో రాంబాబు రెడ్డి, ఆలయ కమిటీ ఏర్పాట్లు చేశారు. కపిలేశ్వరపురం ఏటిగట్టున ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం జరిగింది. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక గ్రామస్తులతోపాటు మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



కె.గంగవరం: యండగండిలో కల్యాణం చేస్తున్న రుత్వికులు

భక్తి శ్రద్ధలతో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

కె.గంగవరం: సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. శుక్రవారం రాత్రి సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో జరిపారు. స్వామి వారికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం వేదపండితులు స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా జరిపారు. యండగండిలో ఆలయ అర్చకులు కొత్తలంక నాగేశ్వరరావు బ్రహ్మత్వంలో రుత్వికులు స్వామి వారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహిం చారు. మండలంలోని పామర్రు, దంగేరు తది తర గ్రామాల్లో స్వామి కల్యాణాలు జరిపారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.

స్వామివారి కల్యాణంలో ఎమ్మెల్యే దంపతులు



వెదురుపాకలో కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులు

రాయవరం, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని వెదురుపాక పార్వతి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా జరిపారు. వేదపండితులు యలమంచలి రాజశేఖరశర్మ, ప్రసాద శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపారు. స్వామి, అమ్మవార్లకు వారు పట్టువస్త్రాలు అందించారు. 2004లో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించినప్పటి నుంచి ఎమ్మెల్యే దంపతులు స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నారని టీడీపీ నాయకుడు వడ్డాది చిన్న కృష్ణంరాజు తెలిపారు. ఎమ్మెల్యే వెంట వడ్డాది పండు, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కొవ్వూరి చంటిరెడ్డి, టీడీపీ నాయకుడు కొవ్వూరి నాగిరెడ్డి, కొవ్వూరి అబ్బాయిరెడ్డి, బీజేపీ నాయకుడు అంగర జనార్ధనాచార్యులు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పసలపూడి గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పోతంశెట్టి వెంకట సత్యనారాయణరెడ్డి, సుజాత దంపతులు స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని జరిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చింతా నాగ రామకృష్ణారెడ్డి, పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి, చైతన్య రాజబాబు, పడాల గంగిబాబు, పడాల అబ్బాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలోచనలు దేశానికి శరణ్యం



కొత్తపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, డిసెంబర్ 6(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం పాతబస్టాండ్ సెంటర్, పంచాయతీ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మి, బీర ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): అంబేడ్కర్ ఆలోచనలు దేశానికి శరణ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు, మంత్రి సుభాష్ తండ్రి సత్యం అన్నారు. అంబే డ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని రామచంద్రపురంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించా రు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏసు దాసు, వాసంశెట్టి బాల తదితరులతో పాటు బీజేపీ నాయకుడు పలివెల రాజు తదితరులు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతిలో అంబేడ్కర్ చిత్రపటానికి అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు డీఎస్ ఎస్ శర్మ, పలివెల సత్యనారాయణ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆలమూరు: అంబేడ్కర్ వర్ధంతిని ఆలమూరు మండలంలో జరిపారు. మండలంలోని అంబేడ్కర్ విగ్రహాలకు పలువురు నేతలు నివాళులర్పించారు. ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ నరసింహస్వామి అధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆలమూరు బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులు అంబేడ్కర్ వర్ధంతిని జరిపారు.

ఆత్రేయపురం: అంబేడ్కర్ వర్ధంతిని పురస్క రించుకుని పంచాయతీ కార్యాలయాల వద్ద సర్ప ంచ్‌లు, సచివాలయ సిబ్బంది అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. పేరవరం సర్పం చ్ గంటి విజయభారతి తదితరుల ఆధ్వర్యంలో సిబ్బంది వర్ధంతిని జరిపారు.

కపిలేశ్వరపురం: అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. మధుసూదనరావు అన్నారు. శుక్రవారం మండలంలోని కాలేరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నాతి చంద్రశేఖర్, బక్కి సతీష్, ముత్తాల సతీష్, బక్కి రాంబాబు, జిల్లెళ్ళ సురేష్, బక్కి వెంకన్న, ఒంటిమి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. **మండపేట:** ప్రజల గుండెల్లో అంబేడ్కర్ చిరస్థాయిగా ఉంటారని మండపేట వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం కరాచీ సెంటరులో వున్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. పట్టణంతోపాటు పలు గ్రామాల్లో ప్రభుత్వ కార్యా లయాలు, సచివాలయాల్లో వర్ధంతిని జరిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, వైసీపీ శ్రేణులు, వైసీపీ కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

రావులపాలెం: అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావుతో పాటు ప్రభుత్వ కళాశాలు, ఇతర ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పలువురు నివాళులర్పించారు.

తాగునీటి కోసం గ్రామస్తుల నిరసన



బస్టాండు సెంటర్లో ఆందోళన చేస్తున్న స్థానికులు

ఆత్రేయపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బొబ్బర్లంక మెగా వాటర్ ప్రాజెక్టు ద్వారా తాగునీరు అందకపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మెగా వాటర్ ప్రాజెక్టు పైపులైన్ ద్వారా తాగునీటిని గ్రామాల్లోకి అనుసంధానం చేశారు. ఆత్రేయపురంలోని బస్టాండ్ సెంటర్ పంచాయతీ వద్ద కుళాయిలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని నింపుతున్నారు. ఇరవై రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. శుక్రవారం కుళాయిల వద్ద ఖాళీ డబ్బాలతో నిరసన వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికార యంత్రాంగానికి మొరపెట్టుకున్నారు.

వేగుళ్లను కలిసిన మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్

మండపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ సభ్యుడుగా కాకినాడకు చెందిన వల్లూరి రాజరవీంద్ర నియమితుల య్యారు. శుక్రవారం ఆయన మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రాజాను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో రాజా వెంట పట్టణ 8వ వార్డు ఇన్‌చార్జి పెందుర్తి ప్రదీప్‌కుమార్, ముమ్మిడివరపు నారాయణ, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు మోరంపూడి సూరిబాబు, చరిష్మ చాందిని తదితరులు వున్నారు.



ఎమ్మెల్యే వేగుళ్లను కలిసిన మాదిగ కార్పొరేషన్ సభ్యుడు రాజా

భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం

ద్రాక్షారామ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండల భవిత కేంద్రంలో శుక్రవారం దివ్యాంగుల దినోత్సవాన్ని జరిపారు. కేవీఆర్ ఆసుపత్రి వైద్యుడు కోట సతీష్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. దివ్యాంగులకు సేవ చేయడం చక్కని అవకాశంగా ఉపాధ్యాయులు భావించాలన్నారు. దివ్యాంగుల్లో నైపుణ్యాన్ని గుర్తించి శిక్షణ ఇస్తే ప్రయోజకులు అవుతారన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎం.శ్రీనివాస్, నాగేశ్వరి, వెటర్నరీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.జయలక్ష్మి తదితరులు మాట్లాడారు. విద్యార్థులకు బహుమతులు అందించారు. దివ్యాంగులతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఉపాధ్యాయురాలు వాణి, ఐఆర్టీలు నాగమణి, ఎంవీబాబు, సీఆర్‌పీలు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు. దివ్యాంగులకు కేవీఆర్ ఆసుపత్రిచే భోజన వసతి కల్పించారు.

ఆత్మీయ సమావేశానికి ముస్తాబైన ప్రభుత్వ పాఠశాలలు

మండపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం నిర్వహించే విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి పాఠశాలలు ముస్తాబయ్యాయి. మండపేట మండలం, రూరల్‌లో మొత్తం 69 పాఠశాలల్లో ఈ సమావేశాలు జరుగుతాయని మండల విద్యాధికారి సోమిరెడ్డి తెలిపారు. ఎంపిక చేసిన రెండు పాఠశాలల్లో వైద్య శిబిరాలు జరుగుతాయని తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, తాపేశ్వరం హైస్కూల్ రెండుచోట్లా వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే పాఠశాలలను ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం జరిగే వేడుకల కోసం సిద్ధం చేశారు.



సంగంకాలనీలో సమావేశానికి సిద్ధమైన విద్యార్థులు



మాజీ ఎమ్మెల్యే రాజుకు టీడీపీ సభ్యత్వ కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

టీడీపీ సభ్యత్వ నమోదును బాధ్యతగా తీసుకోవాలి

కొత్తపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదును కార్యకర్తలు, నాయకులు బాధ్యతగా తీసుకుని ముందుకు వెళ్లాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సభ్యత్వ నమోదులో భాగంగా శుక్రవారం కొత్తపేట మాజీ ఎమ్మెల్యే ఐఎస్ రాజుకు పార్టీ సభ్యత్వ కార్డును స్వయంగా ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, గుబ్బల మూర్తి, యెలిశెట్టి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గణితశాస్త్ర అధ్యయనం అలవర్చుకోవాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ),డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గణితశాస్త్ర అధ్యయనం అలవర్చుకోవాలని రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ కోరారు. శుక్రవారం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల నుంచి 50 మంది విద్యార్థులు గణితశాస్త్ర పరిశోధనలకు రామానుజన్ గణిత అకాడమీకి వచ్చారు. విద్యార్థులు గణిత అంశాలను అధ్యయనం చేశారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల అధ్యాపక బృందం డాక్టర్ డీవీఎస్ ఎన్ మూర్తి, డాక్టర్ ఎం.ఎస్ లావణ్య, ఎన్‌వీ మాలతి, వై.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పట్టణ అధ్యక్షుడికి పితృ వియోగం

రామచంద్రపురం(ద్రాక్షారామ),డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణ టీడీపీ అధ్యక్షుడు కడియాల రాఘవన్‌కు శుక్రవారం పితృ వియోగం కలిగింది. రాఘవన్ తండ్రి, వీఎస్ఎం కళాశాల విశ్రాంత అధ్యాపకుడు కడియాల సత్యనారాయణ చౌదరి(85) మృతి చెందారు. కొంత కాలంగా సత్యనారాయణ చౌదరి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈయన మృతిపట్ల పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.

రైస్ గిడ్డంగులను పరిశీలించిన ఎమ్మెల్యే

అంతర్వేది, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి ఎస్‌డబ్ల్యూసీ సివిల్ సప్లయి గోదాము వద్ద మిల్లింగ్ రైస్‌ను గిడ్డంగుల్లో భద్రపరిచే విధానాన్ని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. తర్వాత గోడౌన్లు, రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు.

అమరుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం

పీడీఎస్‌యు జాతీయ కన్వీనర్ రామకృష్ణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల పోరాట స్ఫూర్తితో అవినీతి, అసమానతలకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని పీడీఎస్‌యు జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం రామచంద్రపురంలో చెలికాని రామారావు స్మారక భవనంలో పీడీఎస్‌యు 50 వసంతాల విప్లవ విద్యార్థి అమరవీరుల పోరాటస్ఫూర్తి సభ పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ అధ్యక్షతన జరిగింది. సభలో రామకృష్ణ తదితరులు మాట్లాడారు. వక్తలు మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా వ్యవస్థతో విద్యార్థులు బహుళజాతి సంస్థలకు సేవకులుగా పనిచేస్తున్నారని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.భీమశంకరం, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు వి.చిట్టిబాబు, ఏపీటీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రామచంద్రరావు, యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు చీకట్ల వెంకటేశ్వరరావు, పీడీఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, ఉపాధ్యక్షుడు భాను ప్రసాద్, అరుణోదయ కళాకారుడు శ్రీను తదితరులు సభలో మాట్లాడారు. ముందుగా పట్టణంలో ఎల్ఐసీ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన జరిపారు. అమరవీరుల జెండాను రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాను ప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంబటి కృష్ణ, చింతా రాజారెడ్డి, కరిపోతుల నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల రక్తదానం

రామచంద్రపురం(ద్రాక్షారామ)డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో కొమరిపాలెం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఉద్యోగులు శుక్రవారం రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు తొగరుమూర్తి ప్రారంభించారు. ఇరవై మంది బ్యాంకు ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజరు అజ్జరపు సంతోష్‌కుమార్, ఆపరేషన్ మేనేజరు గవర శ్రీను, అనిల్ కుమార్, శ్రీలక్ష్మీ, విజయభాస్కర్, ఉలిశెట్టి బాబి, పేపకాయల రాంబాబు, బ్లడ్ బ్యాంకు సిబ్బంది డాక్టర్ సునీత, టెక్నిషియన్స్ వాసు, ప్రభాకర్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

వెండి కిరీటాలు బహూకరణ

కాట్రేనికోన, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): నడవపల్లి శ్రీవల్లీదేవసేనసమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కాట్రేనికోనకు చెందిన గ్రంధి నారాయణమూర్తి, సత్యవతి దంపతులు రూ.లక్ష విలువైన రెండు వెండి కిరీటాలను బహూకరించారు. శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకుడు భైరవబొట్ల బ్రహ్మజీ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం వెండి కిరీటాలను అలంకరించారు. అనంతరం స్వామికి కల్యాణం నిర్వహించారు. బంగారు కిశోర్, గిరిజ, గ్రంధి వెంకటసత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

బెతెస్థ ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలు

రావులపాలెం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రావులపాలెం బెతెస్థ ప్రార్థనా మందిరంలో ఫాస్టర్ ఎన్వీ రావ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిపారు. ఈ వేడుకల్లో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని కేక్ కట్ చేశారు. ఫాస్టర్ ఎన్వీ రావ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులకు ఎమ్మెల్యే క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రామకృష్ణ, గుత్తుల పట్టాభిరామారావు, చిలువూరి సతీష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



ర్యాలి ఆలయంలో మాసకల్యాణం దృశ్యం

వైభవంగా జగన్మోహిని కేశవస్వామి కల్యాణం

ఆత్రేయపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి మాసకల్యాణం శుక్రవారం ఘనంగా జరిపారు. కల్యాణ వేదిక వద్ద స్వామివారిని తీసుకువచ్చి విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి మాస కల్యాణాన్ని జరిపి తిలకించారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి వాటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హైందవ శంఖారావానికి తరలిరండి

ద్రాక్షారామ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో తలపెట్టిన హైందవ శంఖారావం సభకు వేలాదిగా తరలి రావాలని సేవా భారతి కార్యదర్శి డీఎస్ఎంఆర్ శర్మ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ద్రాక్షారామ గీతా మందిరంలో ద్రాక్షారామ సంఘ మండల సమావేశం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో 8 గ్రామాల నుంచి 40 మంది వివిధ క్షేత్ర కార్యకర్తలు పాల్గొన్నారు. రామచంద్రపురం కండకార్యవాహ బీవీబీఎల్ నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్ఎస్ఎస్ వ్యవస్థా ప్రముఖ్ యాళ్ల వీరవెంకట సత్యనారాయణ, భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ తోట రామకృష్ణ, బీజేపీ రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి డి.శంకరనారాయణ, ఆర్ఎస్ఎస్ కార్యకర్త ఆళ్ల లక్ష్మీనారాయణ, విశ్వహిందూ పరిషత్ నామా వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.